తిరుమలలో కొనసాగుతున్న రద్దీ


నారాయణగిరి గార్డెన్‌లోని క్యూలో భక్తులు


ఎంబీసీ వద్ద టైం స్లాట్ భక్తుల నిరీక్షణ - అన్నదానం వద్ద.. - గదుల కోసం సీఆర్వో వద్ద పడిగాపులు

తిరుమలలో ఆదివారమూ భక్తుల రద్దీ కొనసాగింది. వేసవి సెలవుల నేపథ్యంలో శుక్రవారం తిరుమలలో రద్దీ పెరిగిన విషయం తెలిసిందే. యాత్రికుల క్యూలైన్లు వెలుపలకు రాకపోయినా వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లోని కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని షెడ్లు సర్వదర్శన భక్తులతో మూడురోజులుగా నిండుతున్నాయి. ఆదివారం కూడా వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో షెడ్లు నిండి.. క్యూలైన్ కృష్ణతేజ సర్కిల్ వరకు వ్యాపించింది. వీరికి 16 గంటల దర్శన సమయం పడుతోంది, టైంస్లాట్ భక్తులకూ దాదాపు మూడు గంటల దర్శన సమయం పడుతోంది. శ్రీవారి ఆలయ ప్రాంతం, అఖిలాండం, లడ్డూకౌంటర్, అన్నప్రసాద భవనం, బస్టాండ్, లేపాక్షి, రాంభగీచ సర్కిల్, వరాహస్వామి విశ్రాంతి భవనాల వద్ద భక్తుల సందడి ఎక్కువగా ఉంది. గదుల కోసం సీఆర్వో, ఎంబీసీ, పద్మావతి విచారణ కార్యాలయాల ముందు భక్తులు బారులు తీరారు. గదులు దొరకని వారు ఆయా కార్యాలయాల ముందు, క్యూలైన్ల వద్ద, వసతి సముదాయాలు, షెడ్లలోనే సేదతీరారు. కేటాయించిన సమయాని కంటే ముందుగానే రావడంతో స్లాటెడ్ సర్వదర్శన భక్తులతో ఎంబీసీ, ఎస్వీ గెస్ట్‌హౌస్ ఏరియాలోనూ రద్దీ ఉంటోంది.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



ముక్కంటి ఆలయంలోనూ..

శ్రీకాళహస్తీశ్వరాలయంలోనూ ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. వారాంతపు సహా వేసవి సెలవులు కావడంతో పెద్దసంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. సుమారు 30 వేలమంది దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రూ.500 అంతరాలయ దర్శనం 536 మంది, రూ.200 శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా 2,341, రూ.50ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా 3,508 మంది భక్తులు దర్శించుకున్నారు. రూ.500 రాహుకేతు టిక్కెట్ల ద్వారా 3,049మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 1,177, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 336, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 318, రూ.5వేలు టిక్కెట్ల ద్వారా 72మంది భక్తులు పూజలు చేయించుకున్నారు. ఐదు రకాల ప్రసాదాలు కలిపి 21,210 విక్రయించినట్టు అధికారులు తెలిపారు.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి

మూగబోయిన షార్

- గగన ప్రయాణంలో దారి తప్పిన పీఎస్ఎల్వీ-సీ 61 రాకెట్



ఆదివారం ఉదయం 5.59 గంటలు. షార్‌లోని మొదటి ప్రయోగ వేదిక నుంచి నారింజ రంగు లేలేత పసిడి వర్ణాలతో పులికాట్ సరస్సు- బంగాళాఖాతానికి మధ్య పీఎస్ఎల్వీ-సీ 61 రాకెట్ నింగిలోకి ఎగిరింది.

6.07 గంటలు : రాకెట్ రెండు దశలు సునాయసనంగా పూర్తిచేసుకొని మూడో దశ ప్రారంభం కాగానే గమన వేగం తగ్గి దారితప్పింది. శాస్త్రవేత్తల్లో ఉత్కంఠ. రాకెట్ ప్రయోగ లైవ్ కూడా కాసేపు నిలిపివేశారు. అందరిలో ఏం జరిగిందో తెలియని పరిస్థితి.

6.11 గంటలు : పీఎస్ఎల్వీ-సీ 61 రాకెట్ మూడో దశలో సాంకేతిక లోపం తలెత్తింది. ప్రయోగం ఇంకా పూర్తికాలేదు. వివరాలన్నీ మళ్లీ వెల్లడిస్తామంటూ మిషన్ కంట్రోల్ సెంటర్ నుంచి ఇస్రో చైర్మన్ నారాయణన్ ప్రకటించారు. లైవ్ ఆగిపోయింది.

అంతే.. ఏం జరిగిందనే దానిపై అందరిలోనూ ఉత్కంఠ. కాసేపటికే మూడో దశలో రాకెట్ వేగం తగ్గి తన గమనాన్ని వీడి దిశ మార్చుకుని విఫలం చెందడంతో శాస్త్రవేత్తలు నిరాశ చెందారు. ఒక్కసారిగా బాధతో కూడిన నిశ్శబ్దం ఆవరించింది.

- సూళ్లూరుపేట, ఆంధ్రజ్యోతి

షార్, శ్రీహరికోట సమీపంలోని సూళ్లూరుపేట, సమీప గ్రామాలన్నీ రాకెట్ ప్రయోగమని సందడిగా ఉన్నాయి. తెల్లవారు జామునుంచే అందరి కళ్లు షార్ వైపే. శనివారం ఉదయం 7.59 గంటలకు ప్రారంభమైన కౌంట్‌డౌన్ నిర్విఘ్నంగా 22 గంటల పాటు కొనసాగి.. ఆదివారం ఉదయం సరిగ్గా 5.59 గంటలకు నిర్దేశిత సమయానికే పీఎస్ఎల్వీ-సీ 61 రాకెట్ నింగిలోకి ఎగిరింది. వీక్షకులతో పాటు షార్ శాస్త్రవేత్తలు, భవనాల పైకెక్కి రాకెట్‌ను చూస్తున్న వారంతా చప్పట్లు కేరింతలు కొడుతూ ఆనందంగా చూశారు. మిషన్ కంట్రోల్ సెంటర్‌లో రాకెట్ గమనాన్ని చూస్తున్న ఇస్రో చైర్మన్ డాక్టర్ వి.నారాయణన్, సహచర శాస్త్రవేత్తలు చూస్తుండగానే రాకెట్ రెండు దశలు సునాయసనంగా పూర్తిచేసుకొంది. మూడో దశ ప్రారంభమై గమనం వేగం తగ్గి దారితప్పింది. శాస్త్రవేత్తల్లో ఉత్కంఠ. రాకెట్ ప్రయోగ లైవ్ కూడా కాసేపు నిలిపివేశారు. అందరిలో ఏం జరిగిందో తెలియని పరిస్థితి. సరిగ్గా 12 నిమిషాలకు ఇస్రో చైర్మన్ మిషన్ కంట్రోల్ సెంటర్ నుంచి పీఎస్ఎల్వీ-సీ 61 రాకెట్ మూడో దశలో సాంకేతిక లోపం తలెత్తిందని, ప్రయోగం ఇంకా పూర్తికాలేదని చెప్పారు. మరోవైపు లైవ్ ఆగింది. దీంతో అప్పటి వరకు సందడిగా ఉన్న మీడి యా సెంటర్‌తో పాటు షార్ ప్రాంతమంతా నిశ్శబ్ద వాతావరణంతో మూగపోయింది. ఈ రాకెట్ ద్వారా పంపిన నిఘా నేత్ర ఉపగ్రహం నింగిలోకి పోకుండా విఫలం చెందింది. ఇస్రో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ప్రయోగించిన ఈవోఎస్-09 (రీశాట్-1బీ) ఉపగ్రహ ప్రయోగం విఫలమవడం అందరినీ నిరాశ పరిచింది.

శాస్త్రవేత్తల్లో తీవ్ర నిరాశ

ప్రయోగం విఫలమని ఇస్రో చైర్మన్ డాక్టర్ వి.నారాయణన్, షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్‌తో కలిసి మీడియా సెంటర్‌కు వచ్చి చెప్పారు. ఇప్పటి వరకు సాలిడ్ మోటారు మూడో దశలో చిన్నపాటి లోపం కూడా తలెత్తలేదు. భారీ ఉపగ్రహాలు, ఒకేసారి 103 ఉపగ్రహాలను కూడా పీఎస్ఎల్వీ రాకెట్ల ద్వారా ఇస్రో శాస్త్రవేత్తలు అలవోకగా అంతరిక్షంలోకి పంపి విజయకేతనం ఎగురవేశారు. అలాంటిది కీలకమైన దేశ రక్షణకు సంబంధించిన ఉపగ్రహ ప్రయోగంలో ఎందుకిలా జరిగిందని తలలుపట్టుకుంటున్నారు. జనవరిలో జీఎస్ఎల్వీ-ఎఫ్ 15 ద్వారా ఎన్‌వీఎస్-02 ఉపగ్రహాన్ని విజయవంతంగా ప్రయోగించారు. మూడు రోజుల తరువాత ఉపగ్రహం నుంచి సంకేతాలు అందలేదు. దీంతో ఆ ప్రయోగం పాక్షిక విజయంగానే మిగిలింది. ఇప్పుడు 101వ ప్రయోగం సాంకేతిక సమస్య తలెత్తి విఫలం చెందడంతో శాస్త్రవేత్తలు తీవ్ర నిరాశ చెందారు.





రాకెట్ గమనం తప్పడంతో ఉత్కంఠగా చూస్తున్న ఇస్రో చైర్మన్ నారాయణన్, షార్ డైరెక్టర్ రాజరాజన్ - మిషన్ కంట్రోల్ నుంచి రాకెట్‌ను చూస్తున్న రేంజ్ ఆపరేషన్ శాస్త్రవేత్తలు

ప్రయోగాన్ని తిలకించిన పార్లమెంటరీ కమిటీ

పీఎస్ఎల్వీ-సీ 61 ప్రయోగాన్ని పార్లమెంటరీ స్థాయి కమిటీ సభ్యుల బృందం తిలకించింది. ఏడుగురితో కూడిన ఈ సభ్యుల బృందం శనివారం రాత్రి శ్రీహరికోటలోనే బసచేసి మిషన్ కంట్రోల్ సెంటర్ నుంచి రాకెట్ ప్రయోగాన్ని వీక్షించారు. దేశ రక్షణకు సంబంధించిన ఉపగ్రహ ప్రయోగం కావడంతో వీరు ఆసక్తిగా తిలకించారు. ప్రయోగం విఫలమైందని తెలిసి.. వీరు శాస్త్రవేత్తల భుజం తట్టి అభినందిస్తూ లోపాన్ని సరిచేసి మరో ప్రయోగాన్ని విజయవంతం చేయాలని ప్రోత్సహించారు.

నేలపట్టును సంరక్షించుకోవాలి

- పక్షుల కేంద్రాన్ని సందర్శించిన పార్లమెంటరీ కమిటీ

దొరవారిసత్రం, మే 18 (ఆంధ్రజ్యోతి): 'నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రం చాలా మంచి పర్యావరణ ప్రకృతి కేంద్రం. ఇటువంటి ప్రాంతాన్ని సంరక్షించుకోవాలి' అని పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చైర్మన్ భువనేశ్వర్ కలిత (అస్సోం రాజ్యసభ సభ్యుడు) అన్నారు. దొరవారిసత్రం మండలం నేలపట్టులోని విదేశీ విహంగాల విడిది కేంద్రాన్ని ఆదివారం ఈ కమిటీ సందర్శించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీజ్ అయిపోవడంతో పక్షులను చూడలేక పోయామన్నారు. ఉన్న కొద్దిపాటి పక్షులు దూరంగా చెట్లపై ఉండటంతో కనిపించలేదన్నారు. మళ్లీ తాను జనవరిలో వ్యక్తిగతంగా వచ్చి పక్షులను చూస్తానన్నారు. సైన్స్ అండ్ టెక్నాలజీ, పర్యావరణం, అడవులు, వాతావరణ మార్పు వంటి అంశాలపై అధ్యయనం చేసే ఈ కమిటీ తన పర్యటనలో భాగంగా నేలపట్టుక వచ్చింది. ఉన్న కొద్దిపాటి పక్షులను బైనాక్యులర్ల ద్వారా వీ వీక్షించారు. ఈసీ కేంద్రంలోని పక్షుల జీవన శైలిపై ఫిలింషో తిలకించారు. వీరికి తిరుపతి సీసీఎఫ్ సెల్వం, సూళ్లూరుపేట డీఎఫ్‌వో హారిక, ఆర్డీవో కిరణ్మయి, నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు, పలువురు షార్ కేంద్రం అధికారులు తమ సిబ్బందితో ప్రొటోకాల్ ఏర్పాట్లు చేపట్టారు. కమిటీ సభ్యులు తేజస్విసూర్య (కర్ణాటక), ప్రద్యుత్ బోర్దోలోయ్ (అస్సోం), మహేష్ కశ్యప్ (ఛత్తీస్‌గఢ్), త్రివేంద్రసింగ్ రావత్ (ఉత్తరాఖండ్), జగదాంబిక పాల్ (ఉత్తరప్రదేశ్), అప్రైడ్‌కంగం ఆర్థర్ (మణిపూర్) పాల్గొన్నారు.


నేలపట్టు ఈసీ కేంద్రంలోని పక్షుల చిత్రాలను చూస్తున్న కమిటీ సభ్యులు

నేటి నుంచి ఏపీఈఏపీ సెట్

- జిల్లాలో 11 కేంద్రాల ఏర్పాటు
- హాజరుకానున్న 22,415 మంది విద్యార్థులు
- 19, 20 తేదీల్లో అగ్రికల్చర్, ఫార్మసీ
- 21 నుంచి 27వ తేదీ వరకు ఇంజినీరింగ్ పరీక్షలు

తిరుపతి(విద్య), మే 18(ఆంధ్రజ్యోతి): ఇంజినీరింగ్, ఫార్మసీ, అగ్రికల్చరల్ ప్రవేశాల కోసం నిర్వహించే ఏపీఈఏపీ సెట్-2025 ప్రవేశ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమై ఈనెల 27వ తేదీ వరకు జరుగనున్నాయి. 19, 20 తేదీల్లో అగ్రికల్చరల్, ఫార్మసీ కోర్సుల ప్రవేశాలకు, 21 నుంచి 27వ తేదీ వరకు ఇంజినీరింగ్ కోర్సుల ప్రవేశాలకు పరీక్షలు నిర్వహించనున్నారు. ఇందుకుగాను తిరుపతిలో 5, పుత్తూరులో 2, గూడూరులో 4 మొత్తం 11 కేంద్రాలను సిద్ధం చేశారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు రెండు సెషన్లుగా పరీక్షలు జరగనున్నాయి. 22,415 మంది విద్యార్థులు హాజరుకానున్నారు.

పరీక్ష కేంద్రాలివే..

తిరుపతి: చదలవాడ రమణమ్మ ఇంజినీరింగ్ కళాశాల, అన్నమాచార్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, శ్రీరామా ఇంజినీరింగ్ కళాశాల, ఎస్వీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, జూపార్క్ సమీపంలోని అయాన్ డిజిటల్ జోన్.

పుత్తూరు: సిద్ధార్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ, శ్రీవెంకటేశ పెరుమాళ్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ.

గూడూరు: ఆదిశంకర కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ, నారాయణ ఇంజినీరింగ్ కళాశాల, ఎన్‌బీకేఆర్ సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాల, ఎన్‌బీకేఆర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల.

ప్రశాంతంగా జేఈఈ అడ్వాన్స్డ్ పరీక్ష

తిరుపతి(విద్య), మే 18(ఆంధ్రజ్యోతి): దేశంలోని ఐఐటీల్లో బీటెక్, బీఎస్, ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సుల్లో ప్రవేశానికిగాను ఆదివారం జాతీయ స్థాయిలో నిర్వహించిన జేఈఈ అడ్వాన్స్డ్ పరీక్ష ప్రశాంతంగా జరిగిందని తిరుపతి కోఆర్డినేటర్ దుర్గ వెల్లడించారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పేపర్-1, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పేపర్-2 పరీక్షలు జరిగాయి. తిరుపతి జూపార్క్ సమీపంలోని అయాన్ డిజిటల్, తిరుపతి-కరకంబాడి మార్గంలోని శ్రీరామ ఇంజినీరింగ్, తిరుపతి-రేణిగుంట మార్గంలోని చదలవాడ రమణమ్మ ఇంజినీరింగ్ కళాశాల, గూడూరు ఆదిశంకర ఇంజినీరింగ్ కళాశాలలో పరీక్షలు జరుగగా 99 శాతం మంది విద్యార్థులు హాజరైనట్లు దుర్గ చెప్పారు.

పీజీఆర్ఎస్‌ను సద్వినియోగం చేసుకోండి

తిరుపతి(కలెక్టరేట్), మే 18(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్, డివిజనల్, మండల కేంద్రాల్లో ప్రతి సోమవారమూ జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆదివారం కలెక్టర్ వెంకటేశ్వర్ ఒక ప్రకటనలో కోరారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. కలెక్టరేట్‌లో జరిగే పీజీఆర్ఎస్‌కు జిల్లా అధికారులు, డివిజన్, మండల కేంద్రాల్లో జరిగే కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు తప్పకుండా హాజరుకావాలని తెలిపారు.

రెండో విడత గ్యాస్ సిలిండర్ డబ్బులు రాలేదా?

- వెంటనే ఆధార్‌తో బ్యాంకు అకౌంటు లింక్ చేసుకోండి



తిరుపతి(నేరవిభాగం), మే 18 (ఆంధ్రజ్యోతి): రెండో విడత గ్యాస్ సిలిండర్ డబ్బులు మీ అకౌంటులో పడలేదా? లేకుంటే మీ ఆధార్‌ను బ్యాంకు అకౌంటుతో లింక్ చేయలేదా? వెంటనే ఉచిత గ్యాస్ సిలిండర్‌కు అర్హులైన వినియోగదారులు తమ ఆధార్‌తో పాటు రేషన్ కార్డును సంబంధిత గ్యాస్ ఏజెన్సీల వద్ద ఇచ్చి లింక్ చేసుకోవాలని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు దాదాపు 2.40 లక్షల మందికి సబ్సిడీ డబ్బులు పడనట్లు తెలిసింది. దీంతో వారు గ్యాస్ బుక్ చేసి సిలిండర్లు వచ్చి నెల రోజులు కావస్తున్నా నగదు జమ కాకపోవడం పట్ల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం గ్యాస్ వినియోగదారులకు దీపం 2 పథకం కింద ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా అందిస్తుంది. ఇప్పటికే లబ్ధిదారుల అకౌంటులో మొదటి గ్యాస్ సిలిండర్‌కు సంబంధించి డబ్బును జమ చేశారు. కొంతమంది తమకు రెండో విడత ఉచిత గ్యాస్ రాయితీ డబ్బులు రాలేదని ఫిర్యాదు చేస్తున్నారు. వీళ్లందరూ మొదటి విడతలో డబ్బులు త్వరగా అకౌంటులో పడ్డాయని కానీ రెండవ విడతలో మాత్రం ఇప్పటి వరకు రాలేదని తెలిపారు. కొన్ని సాంకేతిక సమస్యల వల్ల రెండో విడత గ్యాస్ సిలిండర్ రాయితీకి సంబంధించి నిధులు విడుల చేయడంలో ఆలస్యం జరిగిందని త్వరలోనే ఆ డబ్బులు బ్యాంకు అకౌంటుకు జమ చేస్తామని అధికారులు చెబుతున్నారు. ఈ క్రమంలో కొంతమంది ఈకేవైసీ పూర్తి చేసుకోకపోవడం వల్ల కూడా సబ్సిడీ డబ్బులు పడలేదని అధికారులు అంటున్నారు. దీంతో ఈ నెలాఖరుకు ఈకేవైసీ పూర్తి చేసుకోవాలని లేకుంటే ఉచిత బియ్యంతో పాటు గ్యాస్ సబ్సిడీ నిధులు అకౌంటులో పడవని అంటున్నారు. అన్నీ పూర్తయ్యాక వారం రోజుల వ్యవధిలోనే సబ్సిడీ నిధులు జమవుతాయని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి శేషాచలం రాజు చెప్పారు. కాగా, పట్టణంలో 1000 చదరపు అడుగుల కంటే ఎక్కువ ఇంటి స్థలం ఉన్నా, నెలకు 300 యూనిట్ల కంటే ఎక్కువ విద్యుత్ వాడుతున్నా ఉచిత గ్యాస్ సబ్సిడీకి అనర్హులుగా ప్రభుత్వం ప్రకటించింది.

దివాకర్‌రెడ్డి నియామకంపై హర్షం

తిరుపతిరూరల్, మే 18 (ఆంధ్రజ్యోతి): తుడా అధ్యక్షుడిగా డాలర్స్ దివాకర్‌రెడ్డిని నియమించడంపై తుమ్మలగుంటకు చెందిన టీడీపీ సీనియర్ నాయకులు బిరుదాల కృష్ణారెడ్డి, జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు బిరుదాల హనుమంతరెడ్డి ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. పార్టీపట్ల నిబద్ధత, విధేయత కలిగిన ఆయన్ను ఎంపిక చేసిన సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.



వైభవంగా వసంతోత్సవాలు

స్వర్ణరథంపై కాంతులీనిన కల్యాణ వెంకన్న


స్వర్ణరథంపై ఆలయ మాడవీధుల్లో దర్శనమిస్తున్న కల్యాణ వెంకన్న

చంద్రగిరి, మే 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీనివాసమంగాపురం కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయ వార్షిక వసంతోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం సాయంత్రం శ్రీదేవిభూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి స్వర్ణరథంపై ఆలయ మాడ వీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి తోమాల, కొలువు, పంచాంగ శ్రవణం, సహస్రనామార్చన నిర్వహించారు. అనంతరం శ్రీవారి ఉత్సవర్లను వసంత మండపానికి వేంచేపు చేసి ఆస్థానం చేపట్టారు. స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఉత్సవర్లను విశేషంగా అలంకరించి, స్వర్ణరథంలో అధిష్ఠించారు. నాలుగు మాడవీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రత్యేక డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఈఈ జగన్మోహన్‌రెడ్డి, డిప్యూటీ ఈవో దామోదరం, ఏఈవో గోపినాథ్, అర్చకులు బాలాజీరంగాచార్యులు, శేషాద్రిచార్యులు, పార్థసారథి, నారాయణాచార్యులు, సూపరింటెండెంట్లు రమేష్‌కుమార్, రాజ్‌కుమార్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ మునికుమార్, అర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్, జమేదార్ చిరంజీవి పాల్గొన్నారు.

అలరించిన దుర్యోధన వధ


దుర్యోధన వధ కార్యక్రమంలో తలపడుతున్న దుర్యోధన, భీమ వేషధారులు

భాకరాపేట, మే 18(ఆంధ్రజ్యోతి): చిన్నగొట్టిగల్లు మండలం ఎడంవారిపల్లెలో జరుగుతున్న మహాభారత ఉత్సవాలలో ఆఖరి ఘట్టమైన దుర్యోధన వధ ఆద్యంతం ప్రేక్షకులను అలరించింది. దుర్యోధన, భీమ వేషధారులు మహాభారత ఘట్టాలను వివరించారు. కురుక్షేత్ర యుద్ధంలో కౌరవులందరూ మరణించిన తర్వాత చివరగా మిగిలిన దుర్యోధనుడు నీటి మడుగులో దాక్కొని శివుని గురించి తపస్సు చేస్తుండగా భీముడు బయటకు రప్పించే సన్నివేశం ఆకట్టుకుంది. ఇరువురు వీరోచితంగా పోరాడగా చివరగా దుర్యోధనుడి తొడను భీముడు విరచడంతో మహాభారత యుద్ధం ముగిసింది. రాత్రి అగ్నిగుండ ప్రవేశం నిర్వహించారు.

డీసీఎంఎస్ చైర్మన్‌కు సన్మానం



చంద్రగిరి, మే 18(ఆంధ్రజ్యోతి): డీసీఎంఎస్ చైర్మన్ సుబ్రమణ్యంనాయుడును మండలంలోని పనపాకం పంచాయతీ రవణప్పగారిపల్లె గ్రామస్తులు ఆదివారం సన్మానించారు. గ్రామస్తులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు స్వాగతం పలికి, సన్మాన సభ ఏర్పాటు చేసి, గజమాలతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మాట్లాడు తూ సొంతూరు ప్రజల ఆదరాభిమానాలు ఎన్నటికీ మరువలేనన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నగరం రమేష్, మేడసాని కుమార్, రమణనాయుడు, కేసీ నాయుడు, జయచంద్రనాయుడు, విజయ్‌కుమార్, బొజ్జా వెంకటేష్, బాలకృష్ణమూర్తి, కొండూరు ప్రవీణ్ రాయల్, రాజులగారి వినోద్‌రెడ్డి, లోకేష్, చెంగల్రాయులు, గంగాధరం, జేడీ ప్రసాద్, గురవయ్య పాల్గొన్నారు.

చర్చిని తొలగించాలని ఆందోళన


ఆందోళనకారులను అడ్డుకుంటున్న సీఐ సుబ్బరామిరెడ్డి

చంద్రగిరి, మే 18(ఆంధ్రజ్యోతి): తొండవాడ ఎన్టీఆర్ కాలనీలో అనుమతి లేని చర్చిని తొలగించాలని ఆదివారం హిందూ సంఘాలు ఆందోళనకు దిగాయి. ఆదివారం విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్, బీజేపీ, జనసేన హిందూ సంఘాల నేతలు ఎన్టీఆర్ కాలనీలో ధర్నా చేయడానికి వెళుతుండగా తొండవాడ జాతీయ రహదారిలోని ఫ్లైఓవర్ వద్ద పోలీసులు అడ్డుకున్నారు. అనుమతి లేకుండా చర్చి ఏర్పాటు చేశారని స్థానికులు ఫిర్యాదు చేసినా ఎందుకు పట్టించుకోలేదని నేతలు పోలీసులను నిలదీశారు. పట్టించుకోలేదు కాబట్టే ఆందోళనకు సిద్ధమయ్యామని చెప్పడంతో సీఐ సుబ్బరామిరెడ్డి ఈ విషయాన్ని తహసీల్దార్ శివరామసుబ్బయ్య దృష్టికి తీసుకెళ్లారు. రెండు రోజుల్లో చర్చిని సీజ్ చేస్తామని చెప్పడంతో ఆందోళనకారులు వెనుదిరిగారు.

కేంద్రమంత్రిని కలిసిన టీటీడీ చైర్మన్


కేంద్ర మంత్రికి తీర్థప్రసాదాలు అందజేస్తున్న చైర్మన్

తిరుమల, మే 18(ఆంధ్రజ్యోతి): కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషిని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు మర్యాదపూర్వకంగా కలిశారు. శ్రీవారి దర్శనం చేసుకుని తిరుపతిలోని పద్మావతి అతిథిగృహానికి చేరుకున్న మంత్రిని చైర్మన్ ఆదివారం రాత్రి కలిశారు. శ్రీవారి శేషవస్త్రం కప్పి తీర్థప్రసాదాలు అందజేశారు. టీటీడీకి సంబంధించిన పలు కార్యక్రమాలను మంత్రికి వివరించారు. చైర్మన్‌తో పాటు బోర్డు సభ్యులు భానుప్రకాష్‌రెడ్డి, నరేష్‌కుమార్ ఉన్నారు.



మహిళ ఆత్మహత్య



తిరుపతి(నేరవిభాగం), మే 18(ఆంధ్రజ్యోతి): మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన శెట్టిపల్లిలో ఆదివారం చోటు చేసుకుంది. అలిపిరి ఎస్‌ఐ నాగార్జునరెడ్డి వివరాల మేరకు.. శెట్టిపల్లికి చెందిన కొరివి ఆదిలక్ష్మి (40) భర్త అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. కుటుంబ పోషణ కష్టమైంది. ఉన్న కొద్దిపాటి అప్పులు తీర్చే మార్గం కనిపించలేదు. రుణదాతల నుంచి ఒత్తిడి అధికమైంది. ఈ క్రమంలో మానసిక వేదనకు గురైన ఆదిలక్ష్మి కొన్ని రోజులుగా ముభావంగా ఉంటోంది. రెండు రోజుల క్రితం ఇంట్లోనే రసాయన ద్రావణం తాగింది. ఆమెను కుటుంబ సభ్యులు, పక్క ఇంటి వారు గమనించి రుయా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. మృతురాలు కుమార్తె మానస ఫిర్యాదు మేరకు అలిపిరి ఎస్‌ఐ నాగార్జున రెడ్డి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

గజరాజుపై పద్మావతిదేవి అభయం

● వర్షం కారణంగా మాడవీధుల్లో వాహన సేవ రద్దు



తిరుచానూరు, మే 18 (ఆంధ్ర జ్యోతి): తిరుచానూరులో కొలువైన పద్మావతీ అమ్మ వారు ఆదివారం రాత్రి గజ వాహన ంపై భక్తులకు అభయమిచ్చారు. అమ్మవారి జన్మనక్షత్రం ఉత్తరాషాడను పురస్కరిం చుకుని అర్చకులు ఆలయంలో విశేష పూజా కార్యక్రమాలు నిర్వహిం చారు. మూలవర్లకు అభిషేకం చేశారు. వర్షం కారణంగా గజ వాహన సేవను మాడవీధుల్లో రద్దు చేశారు. వాహన మండపంలోనే అమ్మ వారిని భక్తులు దర్శించుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో హరీందర్‌నాథ్, ఏఈవో దేవరాజులు, ఏవీఎస్వో సతీష్‌కుమార్, సూపరింటెండెంట్లు రమేష్, శ్రీవాణి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు చలపతి, సుబ్బరాయుడు, సుభాస్కర్‌నాయుడు పాల్గొన్నారు.



మట్టి రవాణాను అడ్డుకోకపోతే ఆందోళన ఉధృతం


పాడిపేట చెరువును పరిశీలిస్తున్న తుడా మాజీ చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

తిరుచానూరు, మే 18 (ఆంధ్ర జ్యోతి): మట్టి అక్రమ రవాణాను అధికారులు అడ్డుకోకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని వైసీపీ చంద్రగిరి నియోజవకర్గ ఇన్‌ఛార్జి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి అన్నారు. పాడిపేట చెరువును ఆయకట్టు రైతులు, ఉపాధి కూలీలతో కలిసి ఆదివారం ఆయన సందర్శించారు. ప్రకృతి వనరులను దోచుకుంటున్న టీడీపీ నాయకులపై కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతుల ఆగ్రహానికి గురికాక త్పదని హెచ్చరించారు. మట్టి తరలింపుపై కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజుకు ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ముండ్లపూడి సర్పంచ్ సూరి, పాడిపేట సర్పంచ్ ధనమునిరెడ్డి, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.





నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

తిరుపతి(ఆటోనగర్), మే 18(ఆంధ్రజ్యోతి): తిరుపతి విద్యుత్ టౌన్ డివిజన్ పరిధిలోని బాలాజీ కాలనీ సెక్షన్‌లో విద్యుత్ తీగల మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆ డివిజన్ ఈఈ వి.చంద్రశేఖరరావు తెలిపారు. ప్రకాశం రోడ్డు, ఇందిరానగర్, బాలాజీ కాలనీ, కుమ్మరతోపు సమీప ప్రాంతాల్లో సరఫరాలో అంతరాయం ఉంటుందని వెల్లడించారు.

ఆరోగ్యవరప్రసాదిని పథకానికి

రూ.20 లక్షల విరాళం



తిరుమల, మే18(ఆంధ్రజ్యోతి): టీటీడీ బాలాజీ ఆరోగ్య వరప్రసాదిని పథకానికి ఆదివారం రూ.20 లక్షలు విరాళంగా అందింది. వైజాగ్ హిందూస్థాన్ అసోసియేట్స్‌కు చెందిన మస్తాన్‌రావు ఈ విరాళం డీడీని తిరుమలలో అదనపు ఈవో వెంకయ్య చౌదరికి అంద జేశారు.





రేపు సంస్మరణ సభ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 18 (ఆంధ్రజ్యోతి): ఇటీవల మృతి చెందిన సాహితీవేత్తలు ప్రేమావతి, గొల్లాపిన్ని సుబ్రమణ్య శర్మల సంస్మరణ సభ తిరుపతిలో మంగళవారం నిర్వహించనున్నారు. సాయంత్రం 5 గంటలకు బైరాగిపట్టెడలోని ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో ప్రారంభం కానుంది. సాహితీవేత్తలు, సాహిత్యాభిమానులు పాల్గొనాలని తిరుపతి రచయితల సంఘం కార్యదర్శి డాక్టర్ మన్నవ గంగాధరప్రసాద్ కోరారు.

ఎస్వీయూ వీసీ పదవి బీసీలకు ఇవ్వండి



ఐక్యత తెలుపుతున్న బీసీ సంఘాల నాయకులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 18 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ వీసీ పదవిని బీసీ సామాజిక వర్గానికి కేటాయించాలని బీసీ సంఘాలు కోరాయి. తిరుపతి బాలాజీకాలనీలో గల రాళ్లపల్లె రెస్ట్ హౌస్‌లో ఆదివారం సాయంత్రం సమావేశం నిర్వహించారు. బీసీ సంఘాల నాయకులు బుసగాని లక్ష్మయ్య, సాకం ప్రభాకర్, అక్కినపల్లి లక్ష్మయ్య, నారాయణస్వామిగౌడ్, నారాయణగౌడ్, అమరనాథ్, బుజ్జిబాబు, భరత్, రమణ, నాగరాజు మాట్లాడుతూ అర్హులైన బీసీ సామాజిక వర్గానికి వీసీ పదవిని కేటాయించాలన్నారు. త్వరలో సెర్చ్ కమిటీ సమావేశం కానున్న నేపథ్యంలో ఈ విషయంపై తగు నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు శ్రీనివాసులు, దీపకయాదవ్, మునిరత్నం, శేఖర్, బాలాజీ, ఈశ్వరయ్యగౌడ్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



పన్నులు సకాలంలో చెల్లించాలి



సైకిల్ మారథాన్ నిర్వహిస్తున్న దృశ్యం

తిరుపతి(నేరవిభాగం), మే 18 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ సకాలంలో పన్నులు చెల్లించి, దేశ అభివృద్ధికి సహకరిం చాలని జీఎస్టీ జాయింట్ కమిషనర్ అంబె కోరారు. జులై ఒకటిన ఎనిమిదో వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం తిరుపతి జీఎస్టీ కార్యాలయ ఆధ్వర్యంలో సైకిల్ మరథాన్, వాకథాన్ నిర్వహించారు. పచ్చజెండా ఊపి ప్రారంభించిన అంబె మాట్లాడుతూ ప్రజలు, పన్ను చెల్లింపుదారులు, మేధావులు, వాణిజ్య, వర్తక సంస్థల ప్రతినిధులకు అవగాహన కల్పించడానికి ఈ ర్యాలీ నిర్వహించినట్లు చెప్పారు. స్థానిక కేంద్ర కార్యాలయం నుంచి మహిళా వర్సిటీ, వైకుంఠపురం ఆర్చ్, ఎమ్మార్‌పల్లె సర్కిల్, ఎయిర్ బైపాస్ రోడ్డు మీదుగా ర్యాలీ సాగింది. ఉప కమిషనర్ ఏజే ప్రసాద్, సహాయ కమిషనర్లు వినీ, ప్రేమ పాల్గొన్నారు.





స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయండి సారూ!

ప్రమాదాల నిలయంగా కోట క్రాస్‌రోడ్డు



కోట క్రాస్‌రోడ్డు

కోట, మే 18 (ఆంధ్రజ్యోతి): కోట పట్టణంలోని క్రాస్‌రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారింది. దుగరాజపట్నం, మల్లాం, వాకాడు, విద్యానగర్, నాయుడుపేట, గూడూరు మార్గాలన్నింటికీ కోట పట్టణంలోని క్రాస్‌రోడ్డు కూడలి కావడంతో వాహనాలు రాకపోకలతో నిత్యం రద్దీగా ఉంటుంది. అంతేకాకుండా ఈ మార్గం గుండా సిలికా రవాణా చేసే భారీ వాహనాలు కూడా రాకపోకలు సాగిస్తుంటాయి. స్పీడు బ్రేకర్లు లేకపోవడంతో వాహనాలు వేగంగా వెళుతుంటాయి. ఈ క్రమంలో ఎదురెదురుగా ఢీకొని ప్రమాదాలు జరుగుతున్నాయి. పలువురు మృతి చెందగా, ఎంతో మంది గాయపడ్డారు. క్రాస్‌రోడ్డులో స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేస్తే ప్రమాదాలను అరికట్టవచ్చునని స్థానికులు అధికారులకు విన్నవిస్తున్నా పట్టించుకోవడంలేదు. సంబంధిత అధికారులు స్పందించి కోట క్రాస్‌రోడ్డులో స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

మద్యం మత్తులో...

భార్యను రాయితో కొట్టిచంపిన భర్త



మృతి చెందిన వీనమ్మ

నాయుడుపేట టౌన్, మే 18 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో భార్యను భర్త రాయితో కొట్టి చంపిన ఘటన మండలంలోని మడపలం పిల్లికాలువ వద్ద చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు... గత కొంతకాలంగా మడపలం గ్రామం పిల్లికాలువ సమీపంలో నివాసం ఉంటున్న శ్రీనివాసులు, వీనమ్మ దంపతులు కూలి పనులు చేసుకొని జీవనం సాగిస్తున్నారు. శనివారం సాయంత్రం పనులు ముగించుకున్నాక భార్య, భర్తలిద్దరూ కల్లు సేవించారు. పొద్దుపోయాక ఇంటికి వెళ్తుండగా ఇద్దరి మధ్య వివాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో వెంకటేశ్వర్లు రాయితో భార్య వీనమ్మ ముఖంపై బలంగా కొట్టడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం అందుకున్న ఎస్‌ఐ ఆదిలక్ష్మి సంఘటనాస్థలికి చేరుకొని మృతదేహాన్ని నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నాయుడుపేట పట్టణ టీడీపీ అధ్యక్షుడిగా రఫీ



సమావేశంలో మాట్లాడుతున్న నెలవల సుబ్రహ్మణ్యం

నాయుడుపేట, మే 18 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట పట్టణ టీడీపీ అధ్యక్షుడిగా 786 రఫీ నియమితులయ్యారు. పట్టణంలోని శ్రీనివాస ఫంక్షన్ హాల్లో ఆదివారం టీడీపీ పట్టణ నాయకులతో సూళ్లూరుపేట నియోజకవర్గ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం నిర్వహించారు. ఈ సందర్భంగా రఫీని పట్టణాధ్యక్షుడిగా నెలవల ప్రకటించారు. సమావేశంలో టీడీపీ నాయకులు శోభన చౌదరి, షైలారి రాజశేఖర్, పసల గంగాప్రసాద్, పెసల కిషోర్ బాబు, దార్ల రాజేంద్ర, జీవీఆర్ నాయుడు, జూలపాటి మస్తాన్, కోట్లపూడి రాజేష్, కరీంబాయ్ చెంచయ్య, గుంటూరు లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ మృతుల ఆత్మశాంతి కోసం ర్యాలీ



కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న నవజీవన్ సంస్థ సభ్యులు

నాయుడుపేట టౌన్, మే 18 (ఆంధ్రజ్యోతి): హెచ్‌ఐవీ బారినపడి మృతి చెందిన వారికి ఆత్మశాంతి కోసం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. నాయుడుపేటకు చెందిన నవజీవన్ ఆర్గనైజేషన్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో స్థానిక బీఈడీ కళాశాల నుంచి డీఎం అండ్ హెచ్‌వో కార్యాలయం వరకు ర్యాలీ సాగింది. ఈ కార్యక్రమంలో నవజీవన్ ఆర్గనైజేషన్ మేనేజర్ బాలాజీ, కవిత, మంజుల, శ్రావణి, నందిని, సాయిలక్ష్మి, ఐశ్వర్య తదితరులు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య

తిరుపతి(నేరవిభాగం), మే 18(ఆంధ్రజ్యోతి): మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన తిరుపతి సమీపంలోని శెట్టిపల్లిలో ఆదివారం చోటు చేసుకుంది. అలిపిరి ఎస్‌ఐ నాగార్జునరెడ్డి వివరాల మేరకు.. శెట్టిపల్లికి చెందిన కొరివి ఆదిలక్ష్మి(40) భర్త అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. కుటుంబ పోషణ కష్టమైంది. ఉన్న కొద్దిపాటి అప్పులు తీర్చేమార్గం కనిపించలేదు. రుణదాతల నుంచి ఒత్తిడి అధికమైంది. ఈ క్రమంలో మానసిక వేదనకు గురైన ఆదిలక్ష్మి కొన్ని రోజులుగా ముభావంగా ఉంటోంది. రెండురోజుల క్రితం ఇంట్లోనే రసాయన ద్రావణం తాగింది. కుటుంబ సభ్యులు, పక్క ఇంటి వారు గమనించి రుయా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. మృతురాలు కుమార్తె మానస ఫిర్యాదు మేరకు అలిపిరి ఎస్‌ఐ నాగార్జునరెడ్డి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

మ్యూజియం పనులు

వేగంగా సాగుతున్నాయ్: టీటీడీ

తిరుమల, మే 18 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఎస్వీ మ్యూజియం ఆధునికీకరణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని టీటీడీ ఆదివారం ఓ ప్రకటన ద్వారా తెలిపింది. టాటా ట్రస్టు, బెంగళూరుకు చెందిన మ్యాప్ సిస్టమ్స్ వంటి సంస్థల సహకారంతో ఈ పనులు జరుగుతున్నాయని పేర్కొంది. 'మ్యూజియంలో 14 ఆధునిక గ్యాలరీల పనులు తుదిదశలో ఉన్నాయి. సాలార్‌జంగ్ మ్యూజియం నిపుణుల సహకారంతో 2,200కు పైగా అరుదైన పురాతన వస్తువుల సంరక్షణ పూర్తయింది. తిరుపతిలోని పురాతన దేవాలయ శిల్పకళా మ్యూజియంలోని ప్రదర్శనలను తిరుమల మ్యూజియంలో విలీనం జరిగింది. పాత భవనం చెదిరిపోవడంతో కళాకృతులు కాపాడటానికి ఇది అవసరమైంది. రంగులు, లైటింగ్, డిజిటల్ డిస్‌ప్లేలు వంటి మెరుగుదల పనులు వేగంగా జరుగుతున్నాయి. గత పది నెలల్లో మ్యూజియం పనులు వేగవంతం చేశాం. తిరుమల మ్యూజియంను దేశంలోనే గొప్పదిగా తీర్చిదిద్దేందుకు కృషి జరుగుతోంది. సంప్రదాయంతో పాటు ఆధునిక టెక్నాలజీ వాడటం ద్వారా భక్తులకు మ్యూజియంలో ఒక దివ్యానుభూతి కల్పించేలా పనులు జరుగుతున్నాయి. ఈ ప్రాజెక్ట్ పూర్తయితే భక్తులు, పర్యాటకులు శ్రీవారి వైభవాన్ని, ఆలయ కళా సంపదను ఆస్వాదించే అవకాశం పొందుతారు' అని ఆ ప్రకటనలో టీటీడీ పేర్కొంది.

చర్చిని తొలగించాలని ఆందోళన

చంద్రగిరి, మే 18(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండల పరిధి తొండవాడ ఎన్టీఆర్ కాలనీలో అనుమతి లేని చర్చిని తొలగించాలని ఆదివారం హిందూ సంఘాలు ఆందోళనకు దిగాయి. విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్, బీజేపీ, జనసేన హిందూ సంఘాల నేతలు ఎన్టీఆర్ కాలనీలో ధర్నా చేయడానికి వెళుతుండగా తొండవాడ జాతీయ రహదారిలోని ఫ్లైవోవర్ వద్ద పోలీసులు అడ్డుకున్నారు. అనుమతి లేకుండా చర్చి ఏర్పాటు చేశారని స్థానికులు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, కాబట్టే ఆందోళనకు సిద్ధమయ్యామని చెప్పడంతో సీఐ సుబ్బరామిరెడ్డి ఈ విషయాన్ని తహసీల్దార్ శివరామ సుబ్బయ్య దృష్టికి తీసుకెళ్లారు. రెండు రోజుల్లో చర్చిని సీజ్ చేస్తామని చెప్పడంతో ఆందోళనకారులు వెనుదిరిగారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోండి

గూడూరు అర్బన్, మే 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక డీఆర్‌డబ్ల్యూ కళాశాలలో లక్ష్య ఫౌండేషన్, డీఆర్‌డబ్ల్యూ కళాశాల సహకారంతో ఈనెల 20వ తేదీన నిర్వహించనున్న జాబ్‌మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే నివాసంలో జాబ్‌మేళా పోస్టర్లు విడుదల చేశారు. వివరాలకు 8639835953, 9700561225, 9988853335 నంబర్లను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, లోకనాథం, గణేష్, సునీల్, చెన్నయ్య, ప్రిన్సిపాల్ హనుమంతరావు, రూరల్ సీఐ కిషోర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు

కోట, మే 18 (ఆంధ్రజ్యోతి): కోట మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ఆదివారం శ్రీసిటీలో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు జరిగాయి. శ్రీసిటీలోని డైకిన్ కంపెనీలో పలు విభాగాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ కోసం ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు ఆ సంస్థ హెచ్‌ఆర్ రంజిత్ తెలిపారు.

అనుమానాస్పద మృతిపై విచారణ

కోట, మే 18 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కేశవరం పంచాయతీ కొండుగుండ అటవీ ప్రాంతంలో ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన విషయమై ఆదివారం పోలీసులు విచారణ ప్రారంభించారు. కొండుగుంట అటవీ ప్రాంతంలోని రావి చెట్టు కింద పూర్తిగా మాడిపోయినట్లు ఉన్న సుమారు 45ఏళ్ల గుర్తుతెలియని మృతదేహాన్ని పశువుల కాపరులు శనివారం గుర్తించారు. కేసు నమోదు చేసిన ఎస్‌ఐ పవన్‌కుమార్ విచారణ చేపట్టారు.





మినీమహానాడులో ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, నరసింహయాదవ్ తదితరులు - హాజరైన పార్టీ శ్రేణులు

టీడీపీతోనే అభివృద్ధి, సంక్షేమం

మినీ మహానాడులో ఎమ్మెల్యే సునీల్‌కుమార్

గూడూరు, మే 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పేదలకు సంక్షేమ పథకాలు అందించాలన్నా... రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలన్నా ఒక్క తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమవుతుందని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. ఆదివారం గూడూరు పట్టనంలోని సీఆర్‌రెడ్డి కల్యాణ మండపంలో మినీ మహానాడు నిర్వహించారు. ముందుగా పార్టీ జెండాను ఆవిష్కరించి ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలుగువారి ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన ఎన్టీఆర్ పేదల అభ్యున్నతి కోసమే తెలుగుదేశం పార్టీని స్థాపించారన్నారు. క్రమశిక్షణతో ముందుకు నడుస్తూ పార్టీని స్థాపించిన తొమ్మిది నెలల్లోనే అధికారంలోకి తీసుకువచ్చిన ఘనత ఎన్టీఆర్‌కే దక్కుతుందన్నారు. ఎన్టీఆర్ ఆశయాలను సీఎం చంద్రబాబు నాయుడు ముందుకు తీసుకువెళుతూ నాయకులు, కార్యకర్తల్లో నూతనోత్సాహాన్ని నింపుతున్నారన్నారు. వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని అధోగతిపాలు చేసిందని, సీఎం చంద్రబాబు తన అనుభవంతో సమర్థవంత పాలన అందిస్తూ అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నేరవేరుస్తూ పేదల సంక్షేమానికి పాటు పడుతున్నారన్నారు. తిరుపతి పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు నరసింహయాదవ్, శీలం కిరణ్‌కుమార్ మాట్లాడుతూ మహానాడు తెలుగు ప్రజలకు పండుగలాంటిదన్నారు. కడపలో ఈనెల 27నుంచి 29వ తేదీ వరకు జరగనున్న మహానాడును విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు. అనంతరం ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలని, గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో కలపాలని, ఫ్లైఓవర్, పంబలేరు బ్రిడ్జిలను పూర్తి చేయాలని, స్వర్ణముఖి బ్యారేజీలకు రెండు టీఎంసీల నీటిని విడుదల చేయాలని తీర్మానాలను ప్రవేశపెట్టారు. కార్యక్రమంలో తానంకి నానాజీ, నెలబల్లి భాస్కర్ రెడ్డి, పులిమి శ్రీనివాసులు, వెంకటేశ్వర్లురాజు, ఆరికట్ల మస్తాన్ నాయుడు, బిల్లు చెంచురామయ్య, అబ్దుల్‌రహీం, పాపారెడ్డి మనోజ్ కుమార్‌రెడ్డి, సర్వోత్తమరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, కిషోర్‌నాయుడు, వెంకటేశ్వర్లురెడ్డి, మట్టం శ్రావణి, పట్టాభిరామిరెడ్డి, జలీల్‌ఆహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

అమర జవాన్లకు భారత జాతి రుణపడి ఉంటుంది: విజయశ్రీ



ర్యాలీలో ఎమ్మెల్యే విజయశ్రీ, కూటమి నాయకులు

సూళ్లూరుపేట, మే 18 (ఆంధ్రజ్యోతి): దేశకోసం అమరులైన జవాన్ల త్యాగాలు అమూల్యమని, వారికి భారత జాతి ఎప్పటికి రుణపడి ఉంటుందని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన నేపథ్యంలో ఆదివారం సూళ్లూరుపేట పట్టణంలో తిరంగా ర్యాలీ చేశారు. స్థానిక వినాయకుడి గుడి వద్ద నుంచి ఆర్టీసీ బస్టాండు వరకు ర్యాలీ సాగింది. అక్కడ మానవహారం ఏర్పాటు చేసి భారత్ మాతాకీ జై.. మురళీ నాయక్ అమర్ రహే అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తిరుమూరు సుధాకర్ రెడ్డి, ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, మాధవనాయుడు, నాపా మునిరాజా, బండారు ఆంజనేయులు, బీజేపీ నాయకులు ఆదినారాయణ రెడ్డి, కిరణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొని యువకుడి మృతి

సూళ్లూరుపేట, మే 18 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ ఆలయ దక్షిణవైపునున్న ఆర్చి వద్ద జాతీయ రహదారిపై కారు ఢీకొన్న ప్రమాదంలో ఆదివారం శ్రీకాహహస్తి మండలం సుబ్బానాయుడు కండ్రిగకు చెందిన మధు (32) మృతి చెందాడు. చెంగాళమ్మ ఆలయానికి వచ్చి దర్శనం చేసుకొని తిరిగి వెళ్తున్న సమయంలో ఆర్చి వద్ద రోడ్డు దాటుతుండగా కారు ఢీకొనడంతో మధు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిత్యావసరాల అందజేత

గూడూరు అర్బన్, మే 18(ఆంధ్రజ్యోతి): స్థానిక డీఎస్‌ఆర్ కమ్యూనిటీ హాలులో ఆదివారం సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సీఆర్‌రెడ్డి ఆసరా కార్యక్రమంలో భాగంగా డాక్టర్లు జనార్ధనరెడ్డి, రోహిణి దాతృత్వంతో పేదలకు నిత్యావసరాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో శ్రీనివాసులురెడ్డి, ప్రజేంద్రరెడ్డి, కృష్ణారెడ్డి, వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పార్వేట ఉత్సవం



పార్వేట ఉత్సవం నిర్వహిస్తున్న తుమ్మూరు గ్రామస్తులు

నాయుడుపేట టౌన్, మే 18 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట తుమ్మూరులో వెలసిన శ్రీదేవి భూదేవి సమేత కరిమాణిక్యస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం వైభవంగా పార్వేట ఉత్సవం నిర్వహించారు. ఉదయం స్వామి, అమ్మవార్లకు పూజలు చేశారు. అనంతరం చొప్పర ఉత్సవం, రాత్రి పార్వేట ఉత్సవం నిర్వహించారు.

దివ్యాంగులకు కూరగాయలు, కోడిగుడ్లు



దివ్యాంగులకు కూరగాయలు, కోడిగుడ్లు అందజేస్తున్న జేవీవీసభ్యులు

గూడూరు, మే 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఆదివారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో వాకాటి రామమోహన్ దాతృత్వంతో దివ్యాంగులకు కూరగాయలు, కోడిగుడ్లు అందజేశారు. కార్యక్రమంలో జేవీవీ అధ్యక్షుడు వేగూరు రాజేంద్రప్రసాద్, నాగరాజు, రామమోహన్, పురుషోత్తమరావు, అరుణ్‌కుమార్, శర్మ, రాధయ్య, అశోక్, సుమన్‌రెడ్డి, బాబు, గోపి తదితరులు పాల్గొన్నారు.

తిరుమలలో

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య



ఉద్యానవనంలో మృతదేహం

తిరుమల, మే 18 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఆదివారం గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల వివరాల మేరకు.. తిరుమల జీఎన్సీ టోల్‌గేట్ వద్దనున్న ఉద్యానవనంలో సుమారు 45 ఏళ్ల వయస్సు కలిగిన వ్యక్తి కదలికలు లేకుండా ఉన్నాడనే సమాచారంతో అంబులెన్స్, భద్రతా సిబ్బంది అక్కడికి చేరుకుని పరిశీలించారు. ఆ వ్యక్తి మృతి చెందినట్లు గుర్తించారు. పక్కనే పురుగుల మందు బాటిల్ కనిపించడంతో ఆత్మహత్య చేసుకుని ఉంటాడని భావిస్తున్నారు. మృతదేహాన్ని తిరుమల అశ్విని ఆస్పత్రికి తరలించారు. మృతుడి వివరాలు.. ఆత్మహత్యకు గల కారణాలపై పోలీసులు విచారణ మొదలుపెట్టారు.

ఆదిశంకర కళాశాలలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ



ధ్వజస్తంభానికి పూజలు నిర్వహిస్తున్న ఎంపీ సుజిత్‌కుమార్

గూడూరు, మే 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాలలో నూతనంగా నిర్మించిన వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ధ్వజస్తంభ ప్రతిష్ఠ పూజా కార్యక్రమాన్ని రాజ్యసభ సభ్యుడు సుజిత్‌కుమార్ చేతుల మీదుగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాస్త్ర సాంకేతికతను అందిపుచ్చుకునే విద్యార్థులు భవిష్యత్తులో నాయకులుగా ఎదుగుతారన్నారు. విద్యార్థులు లక్ష్యాలను కష్టపడి సాధించుకోవడంతో పాటు నైతిక విలువలు, సమాజసేవ పట్ల బాధ్యత కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో విద్యాసంస్థల చైర్మన్ వంకి పెంచలయ్య, ధనుంజయ, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం



రక్తదాతలకు సర్టిఫికెట్స్ అందజేస్తున్న టీడీపీ నేత రమేష్

సూళ్లూరుపేట, మే 18 (ఆంధ్రజ్యోతి): సినీనటుడు జూనియర్ ఎన్టీఆర్ పుట్టిన రోజు వేడుకలను ఆదివారం సూళ్లూరుపేటలో ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. స్థానిక సత్యసాయి కల్యాణ మండపంలో తారక్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు వెంకటేష్ యాదవ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. రక్తదాతలకు టీడీపీ ట్టణ అధ్యక్షుడు ఆకుతోట రమేష్ సర్టిఫికెట్స్ అందజేశారు. అదే విధంగా మన్నారుపోలూరు అనాథాశ్రమంలో పిల్లలకు జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు హరికృష్ణ, చంద్రశేఖర్ దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో మేడాసాయి, ఆలీ, గోపికృష్ణ, సుధాకర్, వినోద్ పాల్గొన్నారు.

వెంకటగిరిలో భారీ వర్షం

వెంకటగిరి టౌన్, మే 18(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి పట్టణంలో ఆదివారం భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నప్పటికీ సాయంత్రం మబ్బులు కమ్ముకుని ఈదురు గాలుల కూడిన భారీ వర్షం పడింది. బొగ్గులమిట్టలో విద్యుత్ స్తంభంపై చెట్టు వాలిపోవడంతో దాదాపు మూడు గంటల పాటు సరఫరాలో అంతరాయం ఏర్పడింది.

కోటమ్మకు ప్రత్యేక పూజలు



కోట, మే 18 (ఆంధ్రజ్యోతి): గ్రామదేవత కోటమ్మకు ఆదివారం విశేష పూజలు జరిగాయి. వేద పండితులు అమ్మవారికి పలు అభిషేకాలు చేసి చందన, పుష్పాలంకరణలో ఉంచారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

ముత్యాలమ్మకు...



చిల్లకూరు, మే 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పు కనుపూరు గ్రామంలో వెలిసిన ముత్యాలమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులు ఆలయం వద్ద పొంగళ్లు పెట్టి నైవేద్యంగా నివేదించి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయం ఎదుట ఉన్న త్రిశూలం వద్ద టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఆరోగ్య వరప్రసాదినికి రూ.20 లక్షల విరాళం

తిరుమల, మే18(ఆంధ్రజ్యోతి): టీటీడీ బాలాజీ ఆరోగ్య వరప్రసాదిని పథకానికి వైజాగ్ హిందూస్థాన్ అసోసియేట్స్‌కు చెందిన మస్తాన్‌రావు ఆదివారం రూ.20 లక్షలు విరాళం అందజేశారు.

పొర్లుకట్టను తవ్వితే చర్యలు



పొర్లకట్టను పరిశీలిస్తున్న ఎస్‌ఐ నాగరాజు

పెళ్లకూరు, మే 18 (ఆంధ్రజ్యోతి): స్వర్ణముఖి పొర్లుకట్టను తవ్విన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ నాగరాజు, జలవనరుల శాఖ ఏఈ ఆశా చేతన్ అన్నారు. మండలంలోని కప్పగుంటకండ్రిగ సమీపంలోని స్వర్ణముఖినది నుంచి ఇసుకను తరలించేందుకు కొందరు పొర్లుకట్టను తొలిచి రోడ్డు ఏర్పాటు చేసుకున్నారు. దీనిపై రైతులు, జీలపాటూరు పంచాయతీ సర్పంచు శివకుమార్ అధికారులకు ఫిర్యాదు చేశారు. అలాగే పత్రికల్లో వార్త ప్రచురితం కావడంతో జలవనరులు, పోలీస్‌శాఖ అధికారులు స్పందించారు. ఆదివారం ఎస్‌ఐ నాగరాజు, జలవనరుల శాఖ ఏఈ ఆశా చేతన్ స్వర్ణముఖి పొర్లుకట్టను పరిశీలించారు. ఇసుక తరలించేందుకు పొర్లుకట్టను తవ్వి దారి ఏర్పాటు చేసుకున్నట్లు గుర్తించారు. విచారించి పొర్లుకట్టను ఎవరు తవ్వారో తెలుసుకున్నారు. 24 గంటల్లో పొర్లుకట్ట తవ్విన ప్రాంతాన్ని పూడ్చివేయాలని, లేని పక్షంలో క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

వ్యర్థాలను తొలగించండి



నిరసన తెలుపుతున్న మహిళలు

వెంకటగిరి టౌన్, మే 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తోలిమిట్టలోని జెండా మాను వద్ద పదిరోజుల క్రితం మంచినీటి పైపులైను మరమ్మతుల కోసం మున్సిపాలిటీ సిబ్బంది రోడ్డును తవ్వారు. పనులు పూర్తి చేశాక నామమాత్రంగా పూడ్చారు. రోడ్డుపై కాంక్రీట్ ముక్కలు, రాళ్లు తొలగించకుండా అలాగే వదిలేశారు. దీంతో పాదచారులు, ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. రాత్రిపూట వీధిలో తిరిగే స్థానికులూ ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపై వ్యర్థాలను తొలగించాలని పలుమార్లు మున్సిపాలిటీ సిబ్బందికి చెప్పినా పట్టించుకోవడంలేదంటూ స్థానికులు ఆదివారం వీధిలో నిరసన తెలిపారు. వెంటనే సమస్య పరిష్కరించాలని కోరారు.

ఇంటర్ విద్యార్థినికి నగదు బహుమతి



విద్యార్థినికి నగదు అందజేస్తున్న టీడీపీ నేత చిన్నయ్య తదితరులు

కోట, మే 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిట్టేడులో గల నందమూరి భవతారకం గిరిజన కాలనీకి చెందిన ఇంటర్ విద్యార్థిని హాసినికి టీడీపీ నేత చిన్నయ్య ప్రోత్సాహకంగా నగదు బహుమతి అందజేశారు. కోటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ చదువుతున్న హాసిని 431మార్కులు సాధించి టాపర్‌గా నిలిచింది. ఆదివారం టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు యాకసిరి చిన్నయ్య, మాజీ సర్పంచు ఈగ రఘురామయ్య రూ.5వేల నగదు అందజేశారు. అదేవిధంగా గిరిజన కాలనీలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు రూ.50వేలు ఇస్తానని యాకసిరి చిన్నయ్య ప్రకటించడంతో గ్రామస్తులు ఆయనను అభినందించారు.

పన్నులు సకాలంలో చెల్లించాలి

తిరుపతి(నేరవిభాగం), మే 18 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ సకాలంలో పన్నులు చెల్లించి, దేశ అభివృద్ధికి సహకరించాలని జీఎస్టీ జాయింట్ కమిషనర్ అంబె కోరారు. జులై ఒకటిన ఎనిమిదో వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం తిరుపతి జీఎస్టీ కార్యాలయ ఆధ్వర్యంలో సైకిల్ మరథాన్, వాకథాన్ నిర్వహించారు. పచ్చజెండా ఊపి ప్రారంభించిన అంబె మాట్లాడుతూ ప్రజలు, పన్ను చెల్లింపుదారులు, మేధావులు, వాణిజ్య, వర్తక సంస్థల ప్రతినిధులకు అవగాహన కల్పించడానికి ఈర్యాలీ నిర్వహించినట్లు చెప్పారు. స్థానిక కేంద్ర కార్యాలయం నుంచి మహిళా వర్సిటీ, వైకుంఠపురం ఆర్చ్, ఎమ్మార్‌పల్లె సర్కిల్, ఎయిర్ బైపాస్ రోడ్డు మీదుగా ర్యాలీ సాగింది. కార్యక్రమంలో అసిస్టెండ్ కమిషనర్ ఏజే ప్రసాద్, సహాయ కమిషనర్లు వినీ, ప్రేమ పాల్గొన్నారు.



జీఎస్టీ కార్యాలయం ఆధ్వర్యంలో సైకిల్ మారథాన్ నిర్వహిస్తున్న దృశ్యం

ముక్కంటి సేవలో ప్రముఖులు


ప్రహ్లాద్‌జోషికి జ్ఞాపిక అందజేస్తున్న కోలా ఆనంద్

శ్రీకాళహస్తి, మే 18(ఆంధ్రజ్యోతి): జ్ఞాన ప్రసూ నాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని ఆదివారం పలువురు ప్రముఖులు వేర్వేరు సమయాల్లో దర్శించుకున్నారు. కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి, త్రిపుర మాజీ సీఎం బిప్లవ్‌కుమార్ దేబ్ దర్శించుకున్న వారిలో ఉన్నారు. వారికి ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు ఆశీర్వదించి స్వామిఅమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ అధికారులు సతీష్ మాలిక్, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

పేరంటాలమ్మకు పొంగళ్లు



వరదయ్యపాళెం, మే 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నపాండూరు పంచాయతీ వడ్డిపాళెంలో ఆదివారం పేరంటాలమ్మకు ఘనంగా మేకపోతు పొంగళ్ల కార్యక్రమం జరిగింది. గ్రామంలో మహిళలు ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. అక్కడ పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. సకాలంలో వర్షాలు కురిసి పంటలు బాగా పండి అందరూ సుఖసంతోషాలతో ఉండాలని మొక్కుకున్నారు. నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

నేత్రపర్వం... కల్యాణ వెంకన్న రథోత్సవం


రథోత్సవం - విశేషాలంకరణలో శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకన్న - అశ్వవాహన సేవ

నారాయణవనం, మే 18(ఆంధ్రజ్యోతి): పద్మావతి సమేత కల్యాణ వెంకన్న వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం ఉభయ నాంచారులతో శ్రీవారు రథంలో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ఉదయం 4 గంటలకు సుప్రభాతసేవతో స్వామిఅమ్మవార్లను మేల్కొపి నిత్య పూజా కైంకర్యాలను, శుద్ధి, తోమాల, అర్చన, గంట, నైవేద్యం తదితర సేవలను పూర్తి చేశారు. అనంతరం స్వామిఅమ్మవార్లు తిరుచ్చి వాహనంపై రథమండపానికి వేంచేపు చేశారు. ఉదయం 7.30 గంటలకు రథాన్ని అధిరోహించి మాడవీధుల్లో విహరించారు. సాయంత్రం అశ్వ వాహన సేవ వైభవంగా జరిగింది. అనంతరం ఉభయ నాంచారులతో స్వామివారి కల్యాణోత్సవం నిర్వహించారు. కల్యాణోత్సవంలో పాల్గొన్న దంపతులకు తీర్థ ప్రసాదాలు, వస్త్ర బహుమానాన్ని అందజేశారు. డిప్యూటీ ఈవో నాగరత్న, ఏఈవో రవి, సూపరిటెండెంట్ ధర్మయ్య, ఆలయాధికారి నాగరాజు, ఆలయ ప్రధాన అర్చకులు శ్రీధర్‌భట్టాచార్య, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. రథత్సోవంలో ఎమ్మెల్యే ఆదిమూలం పాల్గొని, స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ముగిసిన అన్నమాచార్య జయంతి ఉత్సవాలు

ఆకట్టుకున్న కళా ప్రదర్శనలు


హరికథా గానం చేస్తున్న కళాకారిణి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 18 (ఆంధ్రజ్యోతి): తొలి తెలుగు వాగ్గేయకారుడు తాళ్లపాక అన్నమాచార్యుల 617 వ జయంతి వేడుకలు ముగిశాయి. అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో అన్నమాచార్య కళా మందిరం వేదికగా కొన్ని రోజులుగా సంగీత కచేరి, హరికథా గానం వంటి కార్యక్రమాలు చేపట్టారు. ఇందులో భాగంగా ఆదివారం ఉదయం తిరుపతిలోని కోదండరామస్వామి ఆలయంలో ఆస్థానం నిర్వహించారు. అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు బృందగానం చేశారు. కె.ఉదయభాస్కర్ బృందం 'అప్పని వరప్రసాది అన్నమయ్య' పేరుతో చేపట్టిన సంగీత కచేరీ ఆకట్టుకుంది. జంధ్యాల కృష్ణకుమారి బృందం అన్నమాచార్యుల జీవిత చరిత్రను హరికథ రూపంలో ప్రదర్శించారు. సాయంత్రం విశాలాక్షి బృందం చేపట్టిన సంగీత కచేరి, సీతాలక్ష్మి బృందం హరికథా గానం ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అన్నమాచార్య ప్రాజెక్టు ప్రత్యేకాధికారి డాక్టర్ మేడసాని మోహన్, ప్రోగ్రాం అసిస్టెంట్ లత, కళాకారులు పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

వైభవంగా కావమ్మ మారయ్య తిరునాళ్లు



పుత్తూరు టౌన్, మే 18(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని గోవిందపాళెంలో కావమ్మ మారయ్య తిరునాళ్లు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం రాత్రి భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం దేవతామూర్తులకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని పొంగళ్లు పెట్టారు. సాయంత్రం కావమ్మ, మారయ్యను ఊరేగించారు. బెస్త సేవా సంఘం సభ్యులు మునిచంద్రయ్య, ప్రవీణ్‌కుమార్, సాయికుమార్, రమేష్, దేవేంద్ర, పార్థసారథి తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రక్తదానం శిబిరం



పుత్తూరు అర్బన్, మే 18(ఆంధ్రజ్యోతి):జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని ఆదివారం పట్టణంలోని ఆయన అభిమానుల ఆధ్వర్యంలో ఎన్టీఆర్ ట్రస్ట్ సహకారంతో రక్తదానం శిబిరం జరిగింది. పట్టణంలోని హిమజా పాఠశాలలో జరిగిన శిబిరానికి యువత, జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు రక్తదానం చేశారు. వారికి సర్టిఫికేట్లు పంపిణీ చేశారు. పద్మనాభం, పిండి కృష్ణ, అభిఐతం, గాంధీ, నగరి మణి, ప్రజ్వల్, కౌశిక్, ఉదయ్ తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

ఇసుక టిప్పర్ స్వాధీనం

రేణిగుంట, మే 18 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను ఆదివారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మండలంలోని మల్లవరం వద్ద సాధారణ తనిఖీలు చేస్తుండగా ఎటువంటి రసీదుల లేకుండా నెల్లూరు నుంచి చిత్తూరుకు టిప్పర్‌లో అక్రమంగా ఇసుకను తరలిస్తున్నట్టు గుర్తించారు.

ఘనంగా మినీ మహానాడు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్

శ్రీకాళహస్తి, మే 18(ఆంధ్రజ్యోతి): తెలుగు దేశం పార్టీ ఆవిర్భావంతో ప్రపంచస్థాయిలో తెలుగువారికి ఖ్యాతి లభించిందని ఎమ్మెల్యే సుధీర్ అన్నారు. పట్టణంలోని ఎన్టీఆర్ భవన్‌లో ఆదివారం శ్రీకాళహస్తి నియోజకవర్గ స్థాయి మినీ మహానాడును ఆయన ప్రారంభించారు. ఇందులో భాగంగా ముందుగా టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ విగ్రహానికి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... యుగ పురుషుడు, దివంగత ఎన్టీఆర్ తెలుగు దేశం పార్టీ ప్రారంభించిన తొమ్మిది నెలల్లోనే అఖండ మెజార్టీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారని కొనియాడారు. ఇక కడపలో జరిగే మహానాడుకు నియోజకవర్గం నుంచి వేలాదిగా పసుపుదళం తరలిరావాలని పిలుపునిచ్చారు. అంతకుముందు యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్ మాట్లాడుతూ... ఎన్టీఆర్ స్ఫూర్తి టీడీపీ కార్యకర్తల్లో ఎన్ని తరాలైనా చిరస్మరణీయంగా కొనసాగుతుందన్నారు. ఆయన ఆశయంతో చంద్రబాబు ముఖ్య మంత్రిగా అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో సుపరి పాలన అందించడం గర్వకారణమన్నారు. నియోజకవర్గ పరిశీలకుడు అంకయ్యనాయుడు, పట్టణ అధ్యక్షుడు విజయకుమార్, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గురవారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి దశరథాచారి, నాయకులు చెంచయ్యనాయుడు, కంఠారమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్ సిందూర్ విజయం జవాన్లకు అంకితం


సత్యవేడులో జాతీయ జెండాతో ర్యాలీ - నాగలాపురం ర్యాలీలో ఎమ్మెల్యే తదితరులు - వరదయ్యపాళెంలో తిరంగా ర్యాలీ

సత్యవేడు, మే 18 (ఆంధ్రజ్యోతి): దేశ రక్షణ కోసం ప్రాణాలను లెక్క చేయకుండా సరిహద్దుల్లో పోరాడుతున్న సైనికులకు కృతజ్ఞతలు తెలపాల్సిన బాధ్యత ప్రజలపై ఉందని ఎమ్మెల్యే ఆదిమూలం అన్నారు. భారత సైనికుల వీరోచిత పోరాట ఫలితమే ఆపరేషన్ సిందూర్ విజయం అన్నారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన నేపథ్యంలో దేశ సైనికులకు కృతజ్ఞతలు తెలుపుతూ సత్యవేడులో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించి, అమరులైన జవాన్లకు శ్రద్ధాంజలి ఘటించారు. త్రివిధ దళాలకు సంఘీభావంగా 50అడుగుల జాతీయ జెండాను చేతపట్టుకుని వందేమాతరం, జైహింద్ నినాదాలు చేస్తూ తిరుపతి బస్టాండ్ నుంచి క్లాక్‌టవర్ మీదుగా గంగమిట్ట వరకు ర్యాలీ చేపట్టారు. బీజేపీ మండల అధ్యక్షుడు బాలాజి, ఎస్సీ మోర్చా నాయకుడు మునికృష్ణయ్య, కోళ్ళచిన్న, బాల మురళికృష్ణ, పీఎస్‌రాజు, వెంకటరమణ, నందకిషోర్, హేమభూషణం, అడ్వకేట్ రాజా, గుత్తి త్యాగరాజు, బండారు మోహన్‌బాబు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు

నాగలాపురం(ఆంధ్ర జ్యోతి): పట్టణంలో ఎమ్మెల్యే ఆదిమూలం ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండ్ నుంచి గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి, యుద్ధంలో వీరమరణం పొందిన సైనికులకు శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వరదయ్యపాళెం (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఆదివారం భారత సైన్యానికి మద్దతుగా కూటమి నాయకుల ఆధ్వర్యంలో 300 అడుగుల జాతీయ జెండాతో తిరంగా ర్యాలీ నిర్వహించారు. జై జవాన్, జైభారత్ నినాదాలు మార్మోగాయి. దిల్లీప్రకాష్, సూర్యనారాయణ, జయకుమార్, వెంకటేష్, శ్రీధర్, సాగర్, పవన్ నాయుడు, దశరథన్, చంద్రశేఖర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.


పిచ్చాటూరులో తిరంగా ర్యాలీ

పిచ్చాటూరు (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సింధూర్ విజయవంతమైన నేపథ్యంలో భారత సైనికులకు సంఘీభావం తెలుపుతూ పిచ్చాటూరులో ఆదివారం సాయంత్రం కూటమి నేతలు జాతీయ జెండాలు చేత పట్టుకుని వందేమాతరం, జైహింద్ నినాదాలతో పట్టణంలో హోరెత్తించారు. అంబేడ్కర్ విగ్రహం నుంచి ఆర్టీసీ బస్టాండ్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. భారత్ జోలికొస్తే ఏం జరుగుతుందో ప్రపంచానికి తెలిసిందన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి


మోహన్ (ఫైల్ ఫొటో)

బుచ్చి నా యుడు కండ్రిగ, మే 18 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని భవానీ శంకర పురంలో జరిగింది. గ్రామానికి చెందిన చింతా రంగయ్య కుమారుడు చింతా మోహన్ (27) ఆదివారం తన వ్యవసాయ పొలంలో మోటరు వేయడానికి వెళ్లాడు. అక్కడ వైరు తెగిన విషయం గమనించకుండా స్టార్టర్ వేస్తుండగా షాక్ కొట్టింది. గమనించిన తండ్రి రంగయ్య కర్రతో వైరును పక్కకు తోశాడు. వెంటనే మోహన్‌ను శ్రీకాళహస్తి పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పరీశీలించిన వైద్యులు మోహన్ అప్పటికే మృతి చెందినట్లు ధృవీకరించారు. కాగా మోహన్ భార్య సంధ్య ప్రస్తుతం నాలుగు నెలల గర్భిణి. వారికి నాలుగు సంవత్సరాల కుమారుడు ఉన్నారు.

మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ మృతికి సంతాపం

శ్రీకాళహస్తి, మే 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బహదూరుపేటకు చెందిన మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ కళత్తూరు మునిరాజా ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అక్కడికి చేరుకుని భౌతికకాయానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు అంజూరు శ్రీనివాసులు, పాలమంగళం శివ, కల్యాణి, సాధన మున్నారాయల్ తదితరులు పాల్గొన్నారు.

దారిలో అక్రమ నిర్మాణాలను తొలగించండి

ఏర్పేడు, మే 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాపానాయుడుపేటలో ధర్మరాజులు స్వామి ఆలయానికి వెళ్లే దారిని అదే గ్రామానికి చెందిన కొందరు ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేస్తున్నారు. 1970 నుంచి దారి ఉంది. అప్పట్లో 11వ నెంబర్ వీధిగా పంచాయతీరాజ్ శాఖ నుంచి మ్యాప్ పాయింటింగ్ చేస్తూ జీవో కూడా ఉంది. అలాంటి వీధిని నాలుగు రోజులుగా అదే గ్రామానికి చెందిన వ్యక్తి అక్రమ నిర్మాణం చేపడుతున్నాడని గ్రామస్తులు వాపోతున్నారు. ఈ అక్రమ నిర్మాణాలను తొలగించాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందించినట్లు ఆలయ మాజీ చైర్మన్ అర్జున్‌బాబు తెలిపారు.

ఆటోడ్రైవర్ నిర్లక్ష్యం

- ముక్కంటి భక్తుడికి తీవ్రగాయాలు


చికిత్స పొందుతున్న వెంకటయ్య

శ్రీకాళహస్తి, మే 18(ఆంధ్రజ్యోతి) ఆటోడ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా ముక్కంటి భక్తుడు వెంకటయ్య(45) తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు... తెలంగాణ రాష్ట్రం నల్గొండ జిల్లాకు చెందిన వెంకటయ్య, ఉపేంద్ర ప్రైవేటు పాఠశాలలో కంప్యూటర్ ఆపరేటర్లు. వీరిద్దరు కుటుంబసభ్యులతో ముక్కంటి ఆలయాన్ని దర్శించుకునేందుకు బస్సులో ఆదివారం సాయంత్రం శ్రీకాళహస్తి ఆర్టీసీ బస్టాండుకు చేరుకున్నారు. ముక్కంటి ఆలయం వద్ద ప్రైవేటు లాడ్జిలో గదిని తీసిస్తానని ఓ ఆటో డ్రైవర్ భక్తులను ఒప్పించాడు. ఈ మేరకు 8 మంది భక్తులను ఆటోలో ఎక్కించుకుని నిర్లక్ష్యంగా నడుపుతూ ఓ ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి రోడ్డు పక్కన ఉన్న బజ్జీల బండిని ఢీకొట్టాడు. ఈ ఘటనలో ఆటోలో ఉన్న వెంకటయ్య తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం క్షతగాత్రుడిని శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఎడమకాలు విరగడంతో వైద్యులు ప్రథమ చికిత్స అనంతరం తిరుపతి రుయాకు రెఫర్ చేశారు. ప్రమాదానికి కారణమైన ఆటోను డ్రైవర్ సహా తెలంగాణ భక్తులు శ్రీకాళహస్తి 1 టౌన్ పోలీసులకు అప్పగించారు.

యాదవుల అభ్యున్నతికి కృషి


సమావేశంలో మాట్లాడుతున్న నరసింహ యాదవ్

శ్రీకాళహస్తి, మే 18(ఆంధ్రజ్యోతి): యాదవుల అభ్యున్నతికి కృషి చేస్తానని యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్ చెప్పారు. పట్టణంలోని కృష్ణమందిరంలో డాక్టర్ చంద్రశేఖర్‌యాదవ్ అధ్యతన సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి నరసింహయాదవ్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... శ్రీకాళహస్తిలో యాదవ కల్యాణమండప నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. అఖిల భారత యాదవ మహాసభ శ్రీకాళహస్తి డివిజనల్ ఇన్‌చార్జిగా కామేష్‌యాదవ్‌ను నియమించారు. అనంతరం నరసింహయాదవ్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సోంప్రకాష్ యాదవ్, మునస్వామియాదవ్, మహేశ్వరి, చంద్రయ్య యాదవ్, ఉమాపతి యాదవ్, బలరాం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాన్ని విమర్శించే అర్హత వైసీపీకి లేదు

నాగలాపురం, మే 18 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం ప్రభుత్వాన్ని, మంత్రి లోకేశ్‌ను విమర్శించే నైతిక అర్హత వైసీపీ నాయకులకు లేదని తిరుపతి పార్లమెంట్ తెలుగు యువత కార్యదర్శి ఆవుల రాంప్రకాష్ పేర్కొన్నారు. సత్యవేడు నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి రాజేష్ తెలుగుదేశం ప్రభుత్వాన్ని విమర్శించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. నాగలాపురం - చిన్నపాండూరు రోడ్డు విస్తరణ పనులకు స్వయంగా అప్పటి మంత్రి పెద్దిరెడ్డి భూమిపూజ చేసి వేసిన శిలాఫలకం ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వం పనితీరును వెక్కిరిస్తోందని ఎద్దేవా చేశారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సంబంధిత పనులకు టెండర్లు పూర్తి చేసిందని త్వరలో పనులు మొదలు కానున్నాయని తెలిపారు. నియోజకవర్గంపై రాజేష్ అవగాహన పెంచుకోవాలని హితవు పలికారు.

మహానాడు స్థల పరిశీలనలో మండల నాయకులు



కేవీబీపురం, మే 18(ఆంధ్రజ్యోతి): కడపలో ఈనెల 27న టీడీపీ నిర్వహించనున్న మహానాడు ప్రాంగణాన్ని ఆదివారం రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌తో కలిసి టీడీపీ బీసీసెల్ రాష్ట్ర కార్యదర్శి మునస్వామియాదవ్ పరిశీలించారు. ఆయనతో పాటు పీవీకండ్రిగ సర్పంచ్ చెంచుప్రతాప్ యాదవ్ ఉన్నారు. మండలం నుంచి అధిక సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలను తరలించాలని శ్రీనివాస్ కోరినట్టు మునస్వామి తెలిపారు.

దళిత విద్యార్థిపై దాడి చేసిన నిందితులను అరెస్టు చేయాలి

ఏర్పేడు, మే 18(ఆంధ్రజ్యోతి): ఎంబీయూలో బీటెక్ చివరి సంవత్సరం చదువుతున్న దళిత విద్యార్థి జేమ్స్‌పై దాడి చేసిన దుండగులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని అంబేడ్కర్ బహుజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అంబేడ్కర్ స్టార్ కృష్ణ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ దురాగతంపై అన్ని సంఘాల నాయకులతో కలిసి కలెక్టర్, ఎస్పీకి ఫిర్యాదు చేయనున్నట్లు ఆయన తెలిపారు.

ఏపీజీఎంపీడబ్ల్యూఏ కమిటీ



శ్రీకాళహస్తి, మే 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎంజీఎం ఆస్పత్రి వద్ద ఆదివారం ఆంధ్రప్రదేశ్ గ్రామీణ మెడికల్ ప్రాక్టీషనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సమావేశానికి ఎంజీఎం ఆస్పత్రి కార్డియాలజిస్ట్ వివేక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన జీఎంపీ సభ్యులకు గుండె సంబంధిత వ్యాధులపై అవగాహన కల్పించారు. అనంతరం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శ్రీకాళహస్తి డివిజన్ అధ్యక్షుడిగా ఎం.వెంకటేశ్వర్లు, సంయుక్త కార్యదర్శిగా సురేష్‌రెడ్డి, కోశాధికారిగా వీరయ్య, కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

చెత్త తొలగింపు



బుచ్చినాయుడుకండ్రిగ, మే 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నీర్పాకోట - సూళ్లూరుపేట రోడ్డు పక్కన ఉన్న చెత్తను సర్పంచ్ విద్యానాథరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఎక్స్‌కవేటర్‌తో తొలగించారు. గ్రామంలోని మిట్ట దళితవాడ సమీపంలో సూళ్లూరుపేట రోడ్డుకు ఇరువైపులా చెత్త పేరుకుపోయి ఇబ్బందికరంగా మారింది. ప్రజలు ఈ విషయాన్ని సర్పంచు దృష్టికి తీసుకెళ్లడంతో చెత్తను తరలించారు. ప్రజల ఎక్కడిబడితే అక్కడ చెత్త వేయడం వలన అనేక రోగాలు వస్తాయని ఒకే దగ్గర చెత్తను వేయాలని సర్పంచ్ కోరారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య


ఉద్యానవనంలో మృతదేహం

తిరుమల, మే 18 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఆదివారం గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల వివరాల మేరకు.. తిరుమల జీఎన్సీ టోల్‌గేట్ వద్దనున్న ఉద్యానవనంలో సుమారు 45 ఏళ్ల వయస్సు కలిగిన వ్యక్తి కదలికలు లేకుండా ఉన్నాడనే సమాచారంతో అంబులెన్స్, భద్రతా సిబ్బంది అక్కడికి చేరుకుని పరిశీలించారు. ఆ వ్యక్తి మృతి చెందినట్లు గుర్తించారు. పక్కనే పురుగుల మందు బాటిల్ కనిపించడంతో ఆత్మహత్య చేసుకుని ఉంటాడని భావిస్తున్నారు. మృతదేహాన్ని తిరుమల అశ్విని ఆస్పత్రికి తరలించారు. మృతుడి వివరాలు.. ఆత్మహత్యకు గల కారణాలపై పోలీసులు విచారణ మొదలుపెట్టారు.

నేడు రచయిత రస్కిన్‌బాండ్ పుట్టిన రోజు వేడుకలు

- రచనలతో ప్రత్యేక స్టాల్ ఏర్పాటు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 18 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ ఆంగ్ల రచయిత, పద్మశ్రీ, పద్మభూషణ్ రస్కిన్‌బాండ్ 91వ పుట్టిన రోజు వేడుకలను సోమవారం తిరుపతిలో నిర్వహించనున్నారు. కథా ప్రపంచం - స్పీకింగ్ టైగర్ ప్రచురణ సంస్థలు సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టాయి. ఆర్టీసీ బస్టాండు ఎదురుగా గల హోటల్ కెన్సెస్‌లో రస్కిన్‌బాండ్ రచనలతో ప్రత్యేక స్టాల్ ప్రత్యేక డిస్కౌంట్‌తో ఏర్పాటు చేశారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ ఈ స్టాల్ నిర్వహిస్తారని నిర్వాహకులు తిరుపతి కిరణ్ తెలిపారు.

ఘనంగా తిరంగా ర్యాలీ


ర్యాలీ నిర్వహిస్తున్న కూటమి నాయకులు

రామచంద్రాపురం, మే 18(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ విజయవంతం అయినందుకు కూటమి నాయకులు, కార్యకర్తలు జాతీయ జెండాతో ఆదివారం ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీవో కార్యాలయం నుంచి ఆర్‌సీపురం వరకు నిర్వహించిన ర్యాలీలో భారత్‌మాతాకు జై అంటూ నినాదాలు చేశారు. బీజేపీ మండలాధ్యక్షుడు జనార్దన్‌నాయుడు మాట్లాడుతూ ఎన్డీయే కూటమి పాకిస్తాన్ ఉగ్రవాదులకు ఆపరేషన్ సిందూర్‌తో సరైన బుద్ధి చెప్పిందన్నారు. పీఎం నరేంద్రమోదీ మూడు రోజుల్లోనే పాకిస్తాన్ మెడలు వంచారన్నారు. ఈ ర్యాలీలో టీడీపీ మండలాధ్యక్షుడు తిరుమలరెడ్డి, జనార్దన్‌చౌదరి, న్యాయవాది మునెయ్య, నరసింహారెడ్డి, హరిప్రసాద్, జనసేన పార్టీ అధ్యక్షుడు సంజీవహరి, మురళీనాయుడు, వెంకటేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ బాధితుల పట్ల వివక్ష వద్దు


వైద్య సిబ్బందితో కలిసి క్యాండిల్ ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు

తిరుపతి(వైద్యం), మే 18(ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ అంటువ్యాధి కాదని, దానిబారిన పడిన వారిపట్ల వివక్ష చూపరాదని డీఎంహెచ్‌వో బాలకృష్ణ నాయక్ అన్నారు. వైద్య సిబ్బందితో కలిసి ఆదివారం రాత్రి స్థానిక వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయ ఆవరణలో ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తూ క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎయిడ్స్‌తో నేటి వరకు ప్రపంచవ్యాప్తంగా 38 మిలియన్ల మంది మృతిచెందారని, వారి ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటూ ఏటా మే మూడవ ఆదివారం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎయిడ్స్ బాధితుల పట్ల వివక్ష చూపితే చట్టప్రకారం శిక్షార్హులవుతారని పేర్కొన్నారు. అనంతరం స్విమ్స్ సర్కిల్ వరకు క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు మురళి, శ్రీనివాసులు, కోటిరెడ్డి పాల్గొన్నారు.

అభినయ్...మీ మద్యం డ్రామాలు ఆపండి : టీడీపీ


మీడియాతో మాట్లాడుతున్న మునికృష్ణ

తిరుపతి, మే 18(ఆంధ్రజ్యోతి) : వైసీపీ తిరుపతి నియోజకవర్గ ఇన్‌చార్జి భూమన అభినయ్ అండ్ బ్యాచ్ ఆదివారం వైన్ షాపులు, బార్ల వద్ద ఆడిన డ్రామాలు రక్తికట్టలేదని టీడీపీ నేత, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ ఎద్దేవా చేశారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో టీడీపీ తిరుపతి పార్లమెంట్ అధికార ప్రతినిధి ఊట్ల సురేంద్ర నాయుడుతో కలసి ఆయన మీడియాతో మాట్లాడారు. మద్యం షాపుల వద్దకు ముందుగానే తన మనుషులను పంపించి డ్రామాలు వేస్తున్నాడని మండిపడ్డారు. గత ఎన్నికల్లో నగర ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పినా జ్ఞానోదయం కాకపోవడం ఆశ్చర్యంగా ఉందన్నారు. గత ఐదేళ్లలో తిరుపతిలో వైసీపీ పెద్దలు చేసిన భూకబ్జాలు, అవినీతి అక్రమాలు, దాడులు ప్రజలు మరిచిపోలేదన్నారు. తిరుపతిలో బార్ల దగ్గర మామూళ్లు వసూలు చేసింది మరిచిపోయారా? అని ప్రశ్నించారు. మద్యం స్కామ్‌లో వైసీపీ అగ్రనేతలు జైలుకు పోవడం ఖాయమన్నారు. ఈ సమావేశంలో నాయకులు ఎస్వీఎం శ్రీధర్, సుబ్బు యాదవ్, రవితేజ నాయుడు, నాగ ప్రతాప్, రూపేష్, ధనుంజయ్‌లు పాల్గొన్నారు.

ముగిసిన అన్నమాచార్య జయంతి ఉత్సవాలు

ఆకట్టుకున్న కళా ప్రదర్శనలు



హరికథా గానం చేస్తున్న కళాకారిణి, కోదండరామస్వామి ఆలయంలో చేపట్టిన ఆస్థానం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 18 (ఆంధ్రజ్యోతి): తొలి తెలుగు వాగ్గేయకారుడు తాళ్లపాక అన్నమాచార్యుల 617 వ జయంతి వేడుకలు ముగిశాయి. అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో అన్నమాచార్య కళా మందిరం వేదికగా కొన్ని రోజులుగా సంగీత కచేరి, హరికథా గానం వంటి కార్యక్రమాలు చేపట్టారు. ఇందులో భాగంగా ఆదివారం ఉదయం తిరుపతిలోని కోదండరామస్వామి ఆలయంలో ఆస్థానం నిర్వహించారు. అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు బృందగానం చేశారు. కె.ఉదయభాస్కర్ బృందం 'అప్పని వరప్రసాది అన్నమయ్య' పేరుతో చేపట్టిన సంగీత కచేరీ ఆకట్టుకుంది. జంధ్యాల కృష్ణకుమారి బృందం అన్నమాచార్యుల జీవిత చరిత్రను హరికథ రూపంలో ప్రదర్శించారు. సాయంత్రం విశాలాక్షి బృందం చేపట్టిన సంగీత కచేరి, సీతాలక్ష్మి బృందం హరికథా గానం ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అన్నమాచార్య ప్రాజెక్టు ప్రత్యేకాధికారి డాక్టర్ మేడసాని మోహన్, ప్రోగ్రాం అసిస్టెంట్ లత, కళాకారులు పాల్గొన్నారు.

కాంట్రాక్టర్ కిడ్నాప్

తిరుపతి(నేరవిభాగం), మే 18 (ఆంధ్రజ్యోతి): తిరుపతికి చెందిన కాంట్రాక్టర్ వెంకటరమణ కిడ్నాప్‌నకు గురయ్యారు. ఈస్ట్ ఎస్‌ఐ గిరిధర్ వివరాల మేరకు.. తిరుపతి ఎంకే నాయుడు కాలనీకి చెందిన పూసపాటి వెంకటరమణ కేంద్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించిన పనులను కాంట్రాక్టు తీసుకున్నాడు. తిరుపతికి చెందిన నగేష్, బాల నరసింహులు, రఘువర్ధన్, కన్నయ్య, విష్ణువర్ధన్ అతని సంస్థలో పనిచేస్తున్నారు. కిసాన్ సభ పేరుతో రైతులను ఆయన సంస్థలో చేర్పించడానికి కొంతమంది సిబ్బందిని నియమించుకున్నాడు. సంస్థ యజమానికి తెలియకుండానే అక్కడ పనిచేస్తున్న సిబ్బంది ఐడీ కార్డులు జారీ చేశారు. దీనిపై ప్రశ్నించినందుకు ఫిబ్రవరి 28న తిరుపతిలోని మహిళా పోలీసుస్టేషన్ ఎదురుగా వున్న ప్రాంతంలో వెంకటరమణను సిబ్బంది కిడ్నాప్ చేశారు. అక్కడి నుంచి శ్రీనివాసమంగాపురం తీసుకెళ్లి తీవ్రంగా కొట్టి చిత్ర హింసలకు గురి చేశారు. బాధితుడు ఆలస్యంగా ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈస్ట్ ఎస్‌ఐ గిరిధర్ కేసు నమోదు చేశారు. నిందితుల కోసం గాలిస్తున్నట్లు చెప్పారు.

గరుడ వారధి నిర్వహణపై దృష్టి పెట్టండి

తిరుపతి(జీవకోన), మే 18(ఆంధ్రజ్యోతి): గరుడ వారధి నిర్వహణను కాంట్రాక్టర్ గాలికి వదిలేశారని, తద్వారా ట్రాఫిక్ సమస్యతో యాత్రికులు, నగర ప్రజలు ఇబ్బంది పడుతున్నారని బీజేపీ నేత నవీన్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. విద్యుత్ దీప కాంతులతో దేదీప్యమానంగా ఉండాల్సిన వారధి కళావిహీనంగా తయారు కావడం బాధ కలిగిస్తోందని తెలిపారు. నిర్మాణం పూర్తయిన తర్వాత రెండేళ్లకొకసారి ఐఎస్‌వో థర్డ్ పార్టీ సర్టిఫికెట్ ద్వారా రోడ్ అండ్ సేఫ్టీ అడిట్ జరిపించాల్సిన బాధ్యత టీటీడీ, నగరపాలక సంస్థ, స్మార్ట్‌సిటీ అధికారులపై ఉన్నా పట్టించుకున్న దాఖలాలు లేవని పేర్కొన్నారు. లీలామహల్ సెంటర్ నుంచి లక్ష్మీపురం, శంకరంబాడీ సర్కిల్, పద్మావతీపురం పైభాగం వరకు ఉన్న జంక్షన్లు, డివైడర్ల బ్యూటిఫికేషన్ నిర్వహణ కాంట్రాక్టర్‌దే అయినప్పటికీ గాలికి వదిలేశారని విశదీకరించారు. దీనిపై సీఎం చంద్రబాబుకు లేఖ రానున్నట్లు తెలిపారు.

నృత్యం ముగ్ధమనోహరం



తిరుచానూరు, మే 18(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో వారాంతపు సెలవుల్లో భాగంగా ఆదివారం కళాకారులు ప్రదర్శించిన నృత్యం ముగ్ధమనోహరంగా సాగింది. బెంగళూరుకు చెందిన దివ్యశ్రీ మ్యూజిక్ అండ్ డ్యాన్స్‌కు చెందిన వైష్ణవి సాయిరాంబ, గీతికబాలిరెడ్డి, రేవతి దిలీప్, నయన, నిధి దిలీప్, నందిక, సంతోష్, వందన మధుసూదన్ తదితర కళాకారులు పుష్పాంజలి, అలరిప్పు, కీర్తనం, స్వరావళి, దేవరణం, శబ్ధం, వర్ణం, నాగస్తుతి, మూకాంబిక అష్టకం వంటి కీర్తనలకు నృత్య ప్రదర్శన చేశారు. వారిని శిల్పారామం ఏవో సుధాకర్ సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు.

డాక్టరేట్ ప్రదానం


శ్రీనివాసరెడ్డి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 18 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ తెలుగు పరిశోధకులు ఎ.శ్రీనివాసరెడ్డి డాక్టరేట్ పొందారు. తెలుగు వెలుగు పత్రికల్లోని కథలు-పరిశీలన అంశంపై ఆచార్య ఆర్.రాజేశ్వరమ్మ పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేశారు. శ్రీనివాసరెడ్డి ప్రస్తుతం కర్నూలు టౌన్ మోడల్ స్కూల్‌లో తెలుగు ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు.

విద్యుత్ అదనపు లోడు క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోండి

తిరుపతి(ఆటోనగర్), మే 18 (ఆంధ్రజ్యోతి): సదరన్ డిస్కం తిరుపతి టౌన్ డివిజన్ పరిధిలో గృహ విద్యుత్ వినియోగదారుల సౌలభ్యం కోసం అదనపు లోడ్ క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోవాలని డీఈఈ ముని ప్రసాద్ విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్సీ)అదనపు లోడ్‌ను క్రమద్ధీకరించుకోవడానికి 50 శాతం రాయితీ కల్పించిందని వెల్లడించారు. ఈ రాయితీని విద్యుత్ వినియోగదారులు లబ్ధిపొందడానికి ఈ ఏడాది జూన్ 30వతేది లోపు స్వచ్ఛందంగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. వినియోగదారులు ఇంటి సర్వీసు తీసుకుంటున్న సమయంలో దరఖాస్తులో అంగీకరించిన లోడ్ కంటే, ఎక్కువ లోడ్ వినియోగిస్తున్న వారు ఈ అవకాశాన్ని పొందవచ్చన్నారు. వినియోగదారులు ఏపీఈఆర్సీ కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవా లన్నారు. రానున్న వేసవి కాలంలో ఏసీలు వినియోగించనున్న వినియోగదారులు తమ విద్యుత్ లోడ్‌ను పరిశీలించుకొని ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

'డిజిటల్ అరెస్టు' అంటూ బెదిరింపు

రూ.70 వేలు కాజేసిన సైబర్ నేరగాళ్లు

తిరుపతి(నేర విభాగం), మే 18 (ఆంధ్రజ్యోతి): 'డిజిటల్ అరెస్టు' గురించి బెదిరింపు కాల్ వస్తే భయపడొద్దని ఎంత ప్రచారం జరిగినా కొందరు మోసపోతూనే ఉన్నారు. సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి నష్టపోతున్నారు. అలా తిరుపతి నగరం కొర్లగుంట మారుతీ నగర్‌కు చెందిన రాజమ్మకు దుండగుడి నుంచి ఫోను కాల్ వచ్చింది. తాను ఐపీఎస్ అధికారిని మాట్లాడుతున్నానని చెప్పాడు. మీరు అరెస్టు కాకుండా ఉండేందుకు నగదు ఇవ్వాలంటూ డిమాండ్ చేశాడు. వెంటనే భయపడిన ఆమె రూ.70 వేలను అతడి ఖాతాకు జమ చేశారు. ఆ తర్వాత తాను మోసపోయానని గ్రహించిన ఆమె.. ఈస్ట్ పోలీసులను సంప్రదించారు. ఈ మేరకు ఈస్ట్ ఎస్‌ఐ మహేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

తిరుపతి(నేర విభాగం), మే 18 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరం కొర్లగుంట మారుతినగర్‌లో శంకరమ్మ (63) అనుమానాస్పద స్థితిలో మృతిచెందారు. అనారోగ్యంతో ఆస్పత్రికి వెళ్లి చికిత్స పొంది.. తిరిగి వచ్చిన ఆమె మృతి చెందడంతో కోడలు కవిత అనుమానం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆమె ఈస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్‌ఐ మహేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పంచలోహ విగ్రహమంటూ మోసం

- ఇద్దరు నిందితుల అరెస్టు


ఇత్తడి విగ్రహం

తిరుపతి(నేర విభాగం), మే 18 (ఆంధ్రజ్యోతి): పంచలోహ విగ్రహమని చెప్పి.. ఇత్తడి కరుమారియమ్మ విగ్రహాన్ని అమ్మి.. మోసగించేందుకు ప్రయత్నించిన ఇద్దరిని ఈస్ట్ పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. వారి నుంచి విగ్రహం స్వాధీనం చేసుకున్నారు. ఈస్ట్ సీఐ శ్రీనివాసులు కథనం మేరకు.. పలమనేరు మండలం కొలమాసనపల్లికి చెందిన గురుస్వామి, తిరుపతి రాయల్ నగర్‌కు చెందిన దేవినేని చంద్ర సమీప బంధువులు. గురుస్వామికి ఏడాది క్రితం తన పొలంలో ఇత్తడి విగ్రహం దొరికింది. ఈ విషయాన్ని తన బంధువు దేవినేని చంద్రకు చెప్పాడు. తిరుపతిలో తనకు తెలిసిన వారు కొంటారని చంద్ర చెప్పాడు. దీంతో ఇత్తడి విగ్రహాన్ని తిరుపతికి తీసుకొచ్చారు. ఇక్కడ అమాయకులను మోసం చేసి విగ్రహం విక్రయించడానికి ప్రయత్నించారు. ఈ విషయం డీఎస్పీ ప్రసాద్‌కు తెలియడంతో వెంటనే ఈస్ట్ సీఐ శ్రీనివాసులు, సిబ్బందిని అప్రమత్తం చేశారు. వారు విగ్రహం విక్రయిస్తున్న ప్రాంతానికి వెళ్లిన సీఐ, సిబ్బంది.. ఇద్దరు నిందితులను పట్టుకుని అరెస్టు చేశారు. వారి నుంచి ఇత్తడి విగ్రహాన్ని స్వాధీనం చేసుకున్నారు.

నేత్రపర్వం... కల్యాణ వెంకన్న రథోత్సవం



రథోత్సవం - విశేషాలంకరణలో శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకన్న - అశ్వవాహన సేవ

నారాయణవనం, మే 18(ఆంధ్రజ్యోతి): పద్మావతి సమేత కల్యాణ వెంకన్న వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం ఉభయ నాంచారులతో శ్రీవారు రథంలో విహరిస్తూ భక్తులను కటాక్షిం చారు. ఉదయం 4 గంటలకు సుప్రభాతసేవతో స్వామిఅమ్మవార్లను మేల్కొపి నిత్య పూజా కైం కర్యాలను, శుద్ధి, తోమాల, అర్చన, గంట, నైవేద్యం తదితర సేవలను పూర్తి చేశారు. అనంతరం స్వామి అమ్మవార్లు తిరుచ్చి వాహనంపై రథమండపానికి వేంచేపు చేశారు. ఉదయం 7.30 గంటలకు రథాన్ని అధిరోహించి మాడవీధుల్లో విహరించారు. సాయంత్రం అశ్వ వాహన సేవ వైభవంగా జరిగింది. అనంతరం ఉభయ నాంచారులతో స్వామివారి కల్యాణో త్సవం నిర్వహించారు. కల్యాణోత్సవంలో పాల్గొన్న దంపతులకు తీర్థ ప్రసాదాలు, వస్త్ర బహుమానాన్ని అందజేశారు. డిప్యూటీ ఈవో నాగరత్న, ఏఈవో రవి, సూపరిటెండెంట్ ధర్మయ్య, ఆలయాధికారి నాగరాజు, ఆలయ ప్రధాన అర్చకులు శ్రీధర్‌భట్టాచార్య, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. రథత్సోవంలో ఎమ్మెల్యే ఆదిమూలం పాల్గొని, స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.





ఆలయ మహద్వారం వద్ద కుటుంబ సభ్యులతో ఆదిపిన్నిశెట్టి - వైభవ్‌రెడ్డి, ఐశ్వర్యరాజేష్

తిరుమలలో సినీ ప్రముఖులు

తిరుమల శ్రీవారిని ఆదివారం పలువురు సినీ ప్రముఖులు దర్శించుకున్నారు. హీరోలు ఆది పిన్నిశెట్టి, వైభవ్‌రెడ్డి, హీరోయిన్లు నిక్కీ గల్రాని, ఐశ్వర్యరాజేష్ ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లి శ్రీవారిని దర్శించుకున్నారు. ఈమేరకు వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు. కాగా, దర్శనం అనంతరం ఆది పిన్నిశెట్టి, నిక్కీ గల్రాని దంపతులు ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. తమ మూడో వివాహవార్షికోత్సవం సందర్భంగా శ్రీవారి ఆశీస్సులు పొందేందుకు తిరుమలకు వచ్చామన్నారు. చాలా రోజులుగా తిరుమలకు రావాలని అనుకుంటున్నప్పటికీ ఇప్పటికి కుదిరిందన్నారు. శ్రీవారి దర్శనంతో మంచి అనుభూతి లభించిందన్నారు. ప్రస్తుతం 'డిస్కో, మరకతమణి-2, డ్రైవ్' అనే సినిమాల్లో నటిస్తున్నట్టు తెలిపారు. కాగా, ఆలయం ముందు సినీనటులను చూసేందుకు పలువురు అభిమానులు ఉత్సాహం చూపారు. వారితో కలిసి సెల్ఫీలు తీసుకునేందుకు ఎగబడ్డారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి


శ్రీవారి సర్వదర్శనానికి 16 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 16 గంటల సమయం పడుతోంది. ఆదివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని 7 షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయి క్యూలైన్ కృష్ణతేజ సర్కిల్ వరకు వ్యాపించింది. ఇక, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శుక్రవారం హుండీ ఆదాయం: రూ.3.13 కోట్లు

శనివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 87,347

తలనీలాలు సమర్పించినవారు: 39,490



మ్యూజియం పనులు వేగంగా సాగుతున్నాయ్: టీటీడీ

తిరుమల, మే 18 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఎస్వీ మ్యూజియం ఆధునికీకరణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని టీటీడీ ఆదివారం ఓ ప్రకటన ద్వారా తెలిపింది. టాటా ట్రస్టు, బెంగళూరుకు చెందిన మ్యాప్ సిస్టమ్స్ వంటి సంస్థల సహకారంతో ఈ పనులు జరుగుతున్నాయని పేర్కొంది. 'మ్యూజియంలో 14 ఆధునిక గ్యాలరీల పనులు తుదిదశలో ఉన్నాయి. సాలార్‌జంగ్ మ్యూజియం నిపుణుల సహకారంతో 2,200కు పైగా అరుదైన పురాతన వస్తువుల సంరక్షణ పూర్తయింది. తిరుపతిలోని పురాతన దేవాలయ శిల్పకళా మ్యూజియంలోని ప్రదర్శనలను తిరుమల మ్యూజియంలో విలీనం జరిగింది. పాత భవనం చెదిరిపోవడంతో కళాకృతులు కాపాడటానికి ఇది అవసరమైంది. రంగులు, లైటింగ్, డిజిటల్ డిస్‌ప్లేలు వంటి మెరుగుదల పనులు వేగంగా జరుగుతున్నాయి. గత పది నెలల్లో మ్యూజియం పనులు వేగవంతం చేశాం. తిరుమల మ్యూజియంను దేశంలోనే గొప్పదిగా తీర్చిదిద్దేందుకు కృషి జరుగుతోంది. సంప్రదాయంతో పాటు ఆధునిక టెక్నాలజీ వాడటం ద్వారా భక్తులకు మ్యూజియంలో ఒక దివ్యానుభూతి కల్పించేలా పనులు జరుగుతున్నాయి. ఈ ప్రాజెక్ట్ పూర్తయితే భక్తులు, పర్యాటకులు శ్రీవారి వైభవాన్ని, ఆలయ కళా సంపదను ఆస్వాదించే అవకాశం పొందుతారు' అని ఆ ప్రకటనలో టీటీడీ పేర్కొంది.

'ఈస్ట్ స్టేషన్'లో భారీ ప్రక్షాళన

- రైటర్ మొదలు బ్లూ కోల్ట్స్, రక్షక్ మొబైల్ సిబ్బంది మార్పు

తిరుపతి(నేరవిభాగం), మే 18(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరంలో అతి పెద్ద స్టేషన్‌గా పేరున్న ఈస్ట్ పోలీసు స్టేషన్ ప్రక్షాళన దిశగా అధికారులు చర్యలు తీసుకున్నారు. ఇప్పటి వరకు అందిన సమాచారం మేరకు కొంత కాలంగా ఈస్ట్‌కు రైటర్లుగా కొనసాగడానికి కొందరు సిబ్బంది పెద్ద ఎత్తున పోటీ పడ్డారు. నిన్నటి వరకు అన్నీ తానై వ్యవహరిస్తూ అటు మీడియాను, ఇటు ఫిర్యాదుదారులను సమన్వయం చేసుకుంటూ సాఫీగా పాలన అందించడంలో కృషి చేసిన ఏఎస్ఐ జగన్‌మోహన్ రెడ్డిని పక్కన పెట్టి తాజాగా సీఐ శ్రీనివాసులు కానిస్టేబుల్ బాలసుబ్రమ్మణ్యంకు రైటర్ బాధ్యతలు అప్పగించారు. సీఐలు మారినప్పుడల్లా ఇక్కడ రైటర్లు మారిపోవడం పరిపాటిగా మారింది. ఇక, కోన్నేళ్లుగా ఫీల్డులో తిరుగుతూ నేరాలు అదుపు చేయడం, బహిరంగంగా మద్యం తాగి మహిళలు, ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్న మందుబాబులను కట్టడి చేసిన బ్లూకోల్ట్స్ సిబ్బందితో పాటు రక్షక్ మొబైల్ సిబ్బందిని మార్చి కొత్త వారికి అవకాశం ఇవ్వనున్నారు. పెరుగుతున్న నేరాలు, హత్యాయత్నాలు, చోరీలు, దొంగతనాలు, భూ ఆక్రమణలు, మిస్సింగ్ కేసులు, భార్యాభర్తల తగాదాలు, చీటింగ్ కేసులు వంటివి పెరుగుతున్న దృష్ట్యా ఈస్ట్‌లో మంచి పనితీరు, ప్రతిభ కనపరచే సిబ్బందికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని భావించి ప్రక్షాళన చేస్తున్నట్లు సమాచారం. తిరుపతి డీఎస్పీ భక్తవత్సలం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఈస్ట్ సీఐ శ్రీనివాసులు ప్రక్షాళనకు శ్రీకారం చుడుతున్నారు. అలాగే ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్ల పనితీరు ఆధారంగా వారికి విధులు అప్పగించి ఈస్ట్ స్టేషన్‌ను నెంబర్ వన్ స్టేషన్‌గా తీర్చిదిద్దే ఆలోచనతో అడుగులు పడుతున్నాయి.




మన సైన్యానికి శక్తిసామర్థ్యాలను ప్రసాదించాలని కోరా


- కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి



శ్రీవారి ఆలయం ముందు ప్రహ్లాద్‌జోషి

తిరుమల, మే18(ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో మన సైన్యానికి కావాల్సిన శక్తిసామర్థ్యాలు ప్రసాదించాలని శ్రీవారిని కోరుకున్నట్టు మంత్రి ప్రహ్లాద్‌జోషి తెలిపారు. తిరుమల శ్రీవారిని ఆదివారం ఉదయం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. సంస్కృతిపరంగా మన దేశం ఎప్పుడూ గొప్పగానే ఉంటుందన్నారు. స్వామి ఆశీస్సులతోనే ఉగ్రవాదంపై మనం ఉక్కుపాదం మోపగలుగుతున్నామన్నారు. ఇక, తిరుమల శ్రీవారిని మాజీ ప్రధాని దేవెగౌడ, ఆయన కుమారుడు మాజీ మంత్రి రేవన్న, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నూతి రామ్మోహనరావు, మాజీ డీజీపీ, ప్రభుత్వ సలహాదారు ఆర్పీ ఠాకూర్ దర్శించుకున్నారు.





మాజీ ప్రధాని దేవెగౌడ - జస్టిస్ నూతి రామ్మోహనరావు

మ్యాంగోనగర్‌లో మొదలైన అమ్మకాలు



మండీలో విక్రయానికి సిద్ధంగా ఉన్న పుల్లేరా మామిడి కాయలు

పాకాల, మే 18 (ఆంధ్రజ్యోతి): పాకాల మండలం దామలచెరువు మ్యాంగోనగర్ మండీలలో మామిడికాయల క్రయ విక్రయాలు మొదలయ్యాయి. మండీలకు బేనీషా, ఖాదర్, పుల్లేరా రకాలు కొనుగోళ్లు జోరుగా సాగుతున్నాయి. పల్ప్ ఫ్యాక్టరీలలో గుజ్జుకు వినియోగించే ఖాదర్ రకం కాయలు టన్ను 27-28 వేలు, రంగు నాణ్యత ఉంటే ఎగుమతికి టన్ను రూ.35 వేల వరకు ధర పలుకుతున్నాయి. పుల్లేరా కాయలకు గుజ్జు పరిశ్రమకు టన్ను రూ.9వేలు, ఎగుమతికి రంగు నాణ్యత బట్టి రూ.15వేల నుంచి రూ.20 వేల వరకు అమ్ముతున్నారు. టేబుల్ వెరైటీ బేనీషా మామిడికాయలు రంగు నాణ్యత బట్టి టన్ను రూ.25 వేల నుంచి రూ.31 వేల వరకు ధర పలుకుతోంది. తోతాపురి రంగు నాణ్యత గల కాయలు ఇతర ప్రాంతాలకు ఎగుమతికోసం టన్ను రూ.15 వేల నుంచి 20 వేల వరకు కొనుగోలు చేస్తున్నారు. మామిడి గుజ్జు పరిశ్రమలు తోతాపురి కాయలు కొనుగోలు ఇంకా ప్రారంభించలేదు. ఈ నెలాఖరు నుంచి గుజ్జు పరిశ్రమలు కొనుగోలు చేయనున్నట్లు మండీ యజమానులు చెబుతున్నారు. నిత్యం మండీలకు ఇప్పుడు ఖాదర్, బేనీషా, పుల్లేరా రకాలను రైతులు తీసుకొస్తున్నారు.

'తోతాపురి' ధరపైనే రైతుల ఆశ

జిల్లాలో అధిక విస్తీర్ణంలో సాగైన, దిగుబడి వచ్చే తోతాపురి మామిడి కాయల ధరపైనే రైతులు ఆశపడుతున్నారు. గుజ్జు పరిశ్రమల్లో తోతాపురికి ధర ప్రకటించకపోవడం, ఈ యేడాది ధర పెద్దగా ఉండదని వ్యాపారులు చెబుతుండటంతో రైతుల్లో నిరాశ నెలకొంది. తోటల్లో తెగులు నివారణకు ఎంతో వ్యయం చేసి పండించిన పంటకు గిట్టుబాటు ధర లేకుండా నాలుగైదేళ్లుగా తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాగు వ్యయం, రసాయనిక ఎరువులు, క్రిమిసంహారక మందులు, కూలీలు, రవాణా ఖర్చులు అధికంగా ఉంటున్నాయని వాపోతున్నారు. సీజన్ ప్రారంభంలోనే టేబుల్ రకాలకు ఆశించిన ధర లేదని రైతులు నిరాశచెందుతున్నారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తామని ప్రజా ప్రతినిధులు, కలెక్టర్ ప్రకటిస్తున్న ఆదేశాలు అమలు కావడం లేదు. గిట్టుబాటు ధర ప్రకటనలకే పరిమితమవుతోంది. మామిడి గుజ్జు పరిశ్రమల యజమానులు, దళారీలు సిండికేట్‌అయి వాళ్లు నిర్ణయించిన ధరలకే కొనుగోళ్లు చేస్తుండడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. మామిడిసాగు వ్యయం దృష్టిలో పెట్టుకొని న్యాయమైన గిట్టుబాటు ధర కల్పించాలని రైతులు కోరుతున్నారు.

ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించుకుందాం

- ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక పిలుపు



సమావేశంలో ప్రసంగిస్తున్న బాలాజి

చిత్తూరు అర్బన్, మే 18 (ఆంధ్రజ్యోతి): 'ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించుకుందాం. ఇందుకోసం ఈనెల 21వ తేదీన ఉమ్మడి చిత్తూరు జిల్లా డీఈవో కార్యాలయాన్ని, 23న రాష్ట్ర విద్యాశాఖ కమిషనరేట్ ముట్టడిని విజయవంతం చేయడానికి టీచర్లు కలిసి రావాలి' అని ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక స్టీరింగ్ కమిటీ మెంబర్, ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు బాలాజి, పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిరిప్రసాద్ పిలుపునిచ్చారు. డీఈవో కార్యాలయం ముట్టడి కార్యాచరణ ప్రణాళికపై ఉమ్మడి చిత్తూరు జిల్లా ఉపాధ్యాయ సంఘాల నేతలు ఆదివారం స్థానిక ఎన్జీవో కార్యాయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం తీసుకువస్తున్న సంస్కరణల కారణంగా విద్యారంగం, ఉపాధ్యాయులు, విద్యార్థులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. వీటిని అరికట్టి కేవలం మూడంచెల వ్యవస్థ (ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు) ఉండేలా కృషి చేయడంతోపాటు హేతుబద్ధీకరణ, బదిలీల కారణంగా నష్టపోతున్న ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రతి ఒక్కరూ కలిసి రావాలన్నారు. ముట్టడి కార్యక్రమాలకు యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రమణ, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కన్నన్, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు మదన్మోహన్‌రెడ్డి, ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెంగల్రాయ మందడి, ఆప్టా జిల్లా అధ్యక్షుడు మునాఫ్, నాయకులు ముక్తార్, గోవిందస్వామి, మునీర్, ముత్యాలరెడ్డి తదితరుల సలహాలు, సూచనలు తీసుకుని కార్యాచరణ రూపొందించారు. పలువురు ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

జిల్లాను బాస్కెట్ బాల్ హబ్‌గా తీర్చిదిద్దుతాం

- శాప్ చైర్మన్ రవి నాయుడు
- ముగిసిన రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ పోటీలు
- బాల, బాలికల విభాగాల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జయకేతనం



ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన బాలుర జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న శాప్ చైర్మన్ రవి నాయుడు, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు

యాదమరి, మే 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాను బాస్కెట్ బాల్ హబ్‌గా తీర్చిదిద్దుతామని శాప్ చైర్మన్ రవి నాయుడు అన్నారు. యాదమరి మండల పరిధిలోని మోర్దానపల్లి పీఈఎస్ పాఠశాలలో జరుగుతున్న రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ బాల, బాలికల బాస్కెట్ బాల్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. సాయంత్రం ఫైనల్స్ జరగ్గా.. బాలబాలికల విభాగాల్లో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా క్రీడాకారులు జయకేతనం ఎగురవేశారు. ● బాలుర విభాగం ఫైనల్స్‌లో అనంతపురం 34 పాయింట్లు సాధించగా, తూర్పు గోదావరి 38 పాయింట్లతో ట్రోఫీని కైవసం చేసుకుంది. ● బాలికల విభాగం ఫైనల్స్‌లో చిత్తూరు 20 పాయింట్లు సాధించగా, తూర్పు గోదావరి 39 పాయింట్లు సాధించి ట్రోఫీ గెలుచుకుంది. విజేతలకు శాప్ చైర్మన్ రవి నాయుడు, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, బాస్కెట్ బాల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ చెంగల్రాయ నాయుడు, వైస్ ప్రెసిడెంట్ ఎన్‌పీ జయప్రకాష్ నాయుడు, టెక్నికల్ కమిటీ ఏపీ చైర్మన్ సురేష్, కార్యదర్శి చక్రవర్తి, డీఎస్డీవో బాలాజీ తదితరులు ట్రోఫీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో శాప్ అబ్జర్వర్ శ్రీనివాసులు, ప్రిన్సిపాల్ వైవీ కృష్ణబాబు, వివిధ జిల్లాల నుంచి వచ్చిన శిక్షకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వరసిద్ధుడి దర్శనానికి 3 గంటలు

కాణిపాకంలోని వరసిద్ధి వినాయక స్వామి దర్శనానికి ఆదివారం మూడు గంటల సమయం పట్టింది. ఆలయానికి ఉదయం నుంచే అధిక సంఖ్యలో భక్తులు విచ్చేశారు. క్యూలైన్లు పూర్తిగా నిండిపోయి వెలుపలకు వ్యాపించాయి. భక్తులకు ఇబ్బంది లేకుండా ఈవో పెంచలకిషోర్ చర్యలు చేపట్టారు.

- ఐరాల(కాణిపాకం), ఆంధ్రజ్యోతి



ఆలయం వెలుపల క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు

ఆటోడ్రైవర్ నిర్లక్ష్యం

- ముక్కంటి భక్తుడికి తీవ్రగాయాలు



చికిత్స పొందుతున్న వెంకటయ్య

శ్రీకాళహస్తి, మే 18(ఆంధ్రజ్యోతి) ఆటోడ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా ముక్కంటి భక్తుడు వెంకటయ్య(45) తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు... తెలంగాణ రాష్ట్రం నల్గొండ జిల్లాకు చెందిన వెంకటయ్య, ఉపేంద్ర ప్రైవేటు పాఠశాలలో కంప్యూటర్ ఆపరేటర్లు. వీరిద్దరు కుటుంబసభ్యులతో ముక్కంటి ఆలయాన్ని దర్శించుకునేందుకు బస్సులో ఆదివారం సాయంత్రం శ్రీకాళహస్తి ఆర్టీసీ బస్టాండుకు చేరుకున్నారు. ముక్కంటి ఆలయం వద్ద ప్రైవేటు లాడ్జీలో గదిని తీసిస్తానని ఓ ఆటో డ్రైవర్ భక్తులను ఒప్పించాడు. ఈ మేరకు 8 మంది భక్తులను ఆటోలో ఎక్కించుకుని నిర్లక్ష్యంగా నడుపుతూ ఓ ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి రోడ్డు పక్కన ఉన్న బజ్జీల బండిని ఢీకొట్టాడు. ఈ ఘటనలో ఆటోలో ఉన్న వెంకటయ్య తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం క్షతగాత్రుడిని శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఎడమకాలు విరగడంతో వైద్యులు ప్రథమ చికిత్స అనంతరం తిరుపతి రుయాకు రెఫర్ చేశారు. ప్రమాదానికి కారణమైన ఆటోను డ్రైవర్ సహా తెలంగాణ భక్తులు శ్రీకాళహస్తి 1టౌన్ పోలీసులకు అప్పగించారు.

డీఎస్సీ అభ్యర్థులకు మోడల్ టెస్టులు: పీఆర్‌టీయూ



చిత్తూరు సెంట్రల్, మే 18 (ఆంధ్రజ్యోతి): పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత మోడల్ టెస్టులు నిర్వహించనున్నట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిరిప్రసాద్, జిల్లా అధ్యక్షుడు కన్నన్ తెలిపారు. ఆదివారం స్థానిక డీఈవో కార్యాలయంలో మాదిరి పరీక్షల నిర్వహణ పోస్టర్‌ను విడుదల చేశారు. త్వరలోనే మాదిరి పరీక్షలు నిర్వహిస్తున్నామని, అభ్యర్థులు తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఇందుకోసం చిత్తూరు జిల్లాలో కన్నన్ (91777 27435), విజయ్ భాస్కర్ రెడ్డి (99854 85453), నరేంద్రరెడ్డి (94947 49373), తిరుపతి జిల్లాలో శ్రీనివాస్ యాదవ్ (95738 01873), సదాశివన్ (99087 29818), తుకారాం (94904 53001)లను సంప్రదించాలన్నారు. పీఆర్‌టీయూ నేతలు పాల్గొన్నారు.





చిన్నారుల మృతదేహాలు

అయ్యో..!

- ఆటలే 'ముంచేశాయి'
- నీటికుంటలో పడి ముగ్గురు చిన్నారుల మృతి

కుప్పం, మే 18 (ఆంధ్రజ్యోతి): జోరుగా కురుస్తుండిన వాన అప్పుడే వెలిసింది. అంతే ఇళ్ల నుంచి బయటికెళ్లి ఆటలు మొదలుపెట్టారో ముగ్గురు పిల్లలు. ఆ ఆటలే వారిని 'ముంచేశాయి'. నీటికుంటలో నిండిన వాన నీరు వారి ఊపిరి తీసింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కుప్పం మండలం దేవరాజపురంలోని చర్చి సమీపంలో ఎస్సీ సామాజిక వర్గం కుటుంబాలు నివసిస్తున్నాయి. ఈ కుటుంబాల్లో పక్క పక్కన ఉండే గుడిసెల్లో ఉంటున్న తిరుపతి వరలక్ష్మిల కుమార్తె గౌతమి (7), రాజ, సుమతిల కుమార్తె షాలిని (6), శరవణ, యశోదల కుమారుడు అశ్విన్ (7)లు సమీప బంధువులు. ఈ ముగ్గురు పిల్లలు కలిసే బడికి వెళ్లడం, ఆటలాడటం చేసేవారు. ఈ నేపథ్యంలో ఆదివారం మధ్యాహ్నం నుంచే ఈ ప్రాంతంలో వాన కురుస్తోంది. మూడు గంటలకు కాస్త తెరపి వచ్చింది. వర్షం ఆగగానే ముగ్గురూ కూడబలుక్కుని గుడిసెల్లోంచి పోలోమంటూ బయటపడ్డారు. ఆపక్కనే చర్చి, దానిని దాదాపుగా ఆనుకుని ఇటీవలనే ఏదో కట్టడంకోసం తీసిన గోతిలో నిండిన వాననీరు. ఆ నీటిని చూసి సంబరపడిపోయారు పిల్లలు. అక్కడికెళ్లి ఆటల్లో పడ్డారు. కుంటలో దిగి, ఒకరిపై ఒకరు బురద చల్లుకున్నారు. ఇంతలో కాలుజారిందో, మరేమయ్యిందో కానీ నీటికుంటలో మునిగిపోయారు. సమీపంలో ఎవరూ లేకపోవడంతో కుంటనుంచి బయటకు రాలేక, సాయం అందక ఊపిరాడక మృతి చెందారు. తర్వాత కుటుంబీకులు వారి శరీరాలకు అంటిన మట్టిని తుడిచి.. ఇళ్లలోని పాత గుడ్డలతో చుట్టి పడుకోబెట్టిన దృశ్యాలను చూసిన వారంతా కన్నీరు పెట్టుకున్నారు. ఆ తల్లిదండ్రుల వేదన వర్ణనాతీతంగా మారింది. విషయం తెలుసుకున్న కుప్పం అర్బన్ సీఐ శంకరయ్య, సిబ్బందితో సాయంత్రం దేవరాజపురం చేరుకుని విచారించారు. కేసు నమోదు చేసి, పిల్లల మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కుప్పం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

తక్షణ సాయంగా రూ.లక్ష

ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో మృతి చెందిన చిన్నారుల కుటుంబాలకు తక్షణ సాయంగా రూ.లక్ష అందించడానికి అధికారులు ముందుకొచ్చారు. సీఎం సహాయ నిధి కింద అదనపు సాయం అందించడానికి కృషి చేస్తామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ హామీ ఇచ్చారు. సాయం అందించడంపై సీఎంకు, కంచర్లకు కుప్పం టీడీపీ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ ధన్యవాదాలన్నారు. అలాగే మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఇసుక టిప్పర్ స్వాధీనం

రేణిగుంట, మే 18 (ఆంధ్రజ్యోతి): మల్లవరం వద్ద ఆదివారం పోలీసుల తనిఖీల్లో ఎటువంటి రసీదులు లేకుండా నెల్లూరు నుంచి చిత్తూరుకు టిప్పర్‌లో ఇసుకను తరలిస్తున్నట్టు గుర్తించారు. ఆ ఇసుక టిప్పర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

శ్రీకాళహస్తిలో మినీ మహానాడు

శ్రీకాళహస్తి, మే 18(ఆంధ్రజ్యోతి): తెలుగు దేశం పార్టీ ఆవిర్భావంతో ప్రపంచస్థాయిలో తెలుగువారికి ఖ్యాతి లభించిందని ఎమ్మెల్యే సుధీర్ అన్నారు. పట్టణంలోని ఎన్టీఆర్ భవన్‌లో ఆదివారం శ్రీకాళహస్తి నియోజకవర్గ స్థాయి మినీ మహానాడును ఆయన ప్రారంభించారు. ఇందులో భాగంగా ముందుగా టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ విగ్రహానికి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... యుగ పురుషుడు, దివంగత ఎన్టీఆర్ తెలుగు దేశం పార్టీ ప్రారంభించిన తొమ్మిది నెలల్లోనే అఖండ మెజార్టీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారని కొనియాడారు. ఇక కడపలో జరిగే మహానాడుకు నియోజకవర్గం నుంచి వేలాదిగా పసుపు దళం తరలిరావాలని పిలుపునిచ్చారు. అంతకు ముందు యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్ మాట్లాడుతూ... ఎన్టీఆర్ స్ఫూర్తి టీడీపీ కార్యకర్తల్లో ఎన్ని తరాలైనా చిరస్మరణీయంగా కొనసాగుతుందన్నారు. ఆయన ఆశయంతో చంద్ర బాబు ముఖ్య మంత్రిగా అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో సుపరిపాలన అందించడం గర్వకారణమన్నారు. నియోజకవర్గ పరిశీలకుడు అంకయ్యనాయుడు, పట్టణ అధ్యక్షుడు విజయకుమార్, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గురవారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి దశరథాచారి, నాయకులు చెంచయ్యనాయుడు, కంఠారమేష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్